J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 42 సంచిక : 20 21.10.2022, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



## తెరపై 'తెలుగుసేన'

3లో






## కాంగీకి 137.. ఖర్గేకి 80

3లో



### నేతలు చెప్తేనే కేసు..

# పవర్ లేని పోలీసు



- ★ అధికార పార్టీ నేతల ఆధిపత్య పోరు మధ్య నలుగుతున్న ఖాకీలు
- ★ పోస్టింగులకి, బదిలీలకి కూడా రాజకీయ గ్రహణం
- ★ నెల్లూరులో 10 నెలలుగా, కావలిలో 6 నెలలుగా డిఎస్పీలు లేరు
- ★ సంకట స్థితిలో వైసిపి అభిమానులు, వైఎస్ ఆత్మీయులు
- ★ బాధితుల మొరాలకించని ఇన్‌ఛార్జిలు, సలహాదారులు, పార్టీ పెద్దలు

అక్టోబర్ 21న పోలీసుశాఖ 'పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం' జరుపుకుంటోంది. ప్రజల మాన, ప్రాణాలను రక్షించడంతోపాటు శాంతిభద్రతలు కాపాడడం, దొంగతనాలను, దోపిడీలను, దౌర్జన్యాలను నివారించడం, ట్రాఫిక్ నియంత్రణ, వీవీఐపిల పర్యటనల సమయాలలో వారికి భద్రత కల్పించడం వంటి అనేక అంశాలలో సమాజానికి భరోసానిచ్చి 'మేమున్నాం' అన్న ధైర్యాన్ని కల్పించే శాఖ పోలీసుశాఖ. విధినిర్వహణలో తమ ప్రాణాలనుసైతం పణంగాపెట్టి పనిచేసే శాఖ పోలీసుశాఖ. అలాంటి పోలీసు శాఖ మనుగడే ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారే పరిస్థితులు ప్రస్తుతం ఆంధ్ర రాష్ట్రంలో నెలకొన్నాయన్న భయాందోళనలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

10లో



# విమానాశ్రయం కోసం భూముల పరిశీలన

గుడ్లూరు మండలంలోని తెట్టు గ్రామ సమీపంలో ఉన్న భూములను ఇటీవల విమానాశ్రయం నిర్మాణం కోసం అధికారులు పరిశీలించారు. తెట్టు-శాంతినగర్ మధ్య జాతీయరహదారి పక్కన దాదాపు రెండువేల ఎకరాల భూములున్నాయని, వాటిలో అటవీశాఖ భూములు ఎక్కువగా ఉన్నట్లు రెవెన్యూ అధికారులు చెప్పారు. రామాయపట్నం పోర్టుకు సమీపంలో విమానాశ్రయం కూడా ఉంటే ఈ ప్రాంతం అన్నిరకాలుగా అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్న నేపథ్యంలో అధికారులు విమానాశ్రయం ఏర్పాటుకు భూములను పరిశీలిస్తున్నారు. పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్‌తో పాటు జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు, విమానాశ్రయాల ముఖ్య కార్య నిర్వహణాధికారి నీరజ్‌కుమార్, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు పాల్గొన్నారు.



## పోర్టు నిర్మాణ పనులపై సమీక్ష


కందుకూరు నియోజకవర్గంలోని రామాయపట్నంలో పోర్టు అనుబంధ పరిశ్రమలకు త్వరలో భూసేకరణ జరుపుతామని కరికాల వలవన్ చెప్పారు. కందుకూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆయన జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబుతో కలిసి అధికారులతో సమావేశమై సమీక్షించారు. పోర్టు నిర్వాసితులకు పునరావాస కాలనీల్లో మౌలిక సదుపాయాలు చేపట్టాలని, ఇళ్ళ నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. నిర్వాసిత గ్రామాలైన మొండివారిపాలెం, రావులపాలెం, కర్లపాలెం, సాలిపేట గ్రామాలకు సంబంధించి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పురోగతిని ప్రస్తావిస్తూ, పోర్టు నిర్మాణంలో భాగంగా తొలిదశ పనులను పూర్తిచేసేందుకు భూసేకరణ వేగవంతం చేయాలన్నారు. పునరావాస కాలనీల నిర్మాణం వెంటనే చేపట్టాలన్నారు. కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, జేసీ కూర్మనాథ్, సబ్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, రామాయపట్నం పోర్టు ఎం.డి ప్రతాప్‌రెడ్డి, తహశీల్దార్ లావణ్య పాల్గొన్నారు.

# రైతులకు అండగా.. పెట్టుబడి సాయం



జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా వుంటూ, ప్రతి రైతు కుటుంబానికి సాగు ఖర్చు కింద పెట్టుబడి సాయం అందిస్తోందని జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. వైఎస్సార్ రైతుభరోసా-పిఎం కిసాన్ పథకం ద్వారా ఏడాదికి 13,500 రూపాయల చొప్పున 2019 సంవత్సరం నుండి రైతుల ఖాతల్లో జమ చేయడం జరుగుతోందని ఆమె పేర్కొన్నారు. ఈనెల 17న ఈ పథకం కింద వరుసగా నాలుగో ఏడాది రెండో విడతగా పంట కోతకు, రబీ అవసరాలకు రాష్ట్రవ్యాప్తంగా 50.92 లక్షల మంది రైతన్నల ఖాతాల్లో ఒక్కొక్కరికి 4 వేల రూపాయలు చొప్పున 2,096.04 కోట్ల ఆర్థిక సహాయాన్ని నంద్యాల జిల్లా ఆళ్ళగడ్డలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి రైతుల బ్యాంకు ఖాతాలలో నేరుగా జమచేశారు. ఈ సందర్భంగా నెల్లూరులోని వ్యవసాయ పరిశోధన స్థానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆనం అరుణమ్మ, జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి పాల్గొని అందుకు సంబంధించిన మెగా చెక్కును వారు లబ్ధిదారులకు అందచేశారు. ప్రభుత్వం అందజేస్తున్న ఈ డబ్బును రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాలుగో విడతలో రెండో దఫా కింద జిల్లాలో ఈ సంవత్సరం 2,10,468 మంది రైతులకు 88.35 కోట్ల రూపాయల ఆర్థికసాయాన్ని అందించడం జరిగిందన్నారు. జిల్లాలో సుమారు 300 కోట్ల రూపాయలతో 536 రైతు భరోసా కేంద్రాల నూతన భవనాలను నిర్మించుకోవడం జరుగుతోందన్నారు. జిల్లాలో భూముల రీ-సర్వే కార్యక్రమం జరుగుతోందని, రైతులకు శాశ్వత భూ రికార్డులందచేస్తామని కలెక్టర్ తెలిపారు.




## విఎస్‌యులో..
# టూరిజం కోర్సు

### పర్యాటక రంగంలో ఉపాధి అవకాశాలు

విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో ఎంబీఏ టూరిజం మేనేజ్‌మెంట్ కోర్సు లభిస్తోందని, దీనికి ఏదైనా డిగ్రీ పూర్తి చేసి ఐసెట్ వ్రాత పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు మాత్రమే అర్హులని వర్శిటీ టూరిజం మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ ఎం.త్యాగరాజు తెలిపారు. వివిధ సంస్థల్లో లక్షల రూపాయల ఫీజుతో లభించే ఈ కోర్సు విఎస్‌యులో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ నిధుల సహకారంతో ఏడాదికి కేవలం 13,500 రూపాయల ఫీజుకే లభిస్తోందని, జగనన్న విద్యాదీవెన ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హత గల విద్యార్థులు ఉచితంగా ఈ కోర్సుని అభ్యసించవచ్చని పేర్కొన్నారు. ఈ కోర్సు చదివే విద్యార్థులు మొదటి 2 సెమిస్టర్లు పూర్తిగా ఎంబీఏ పేపర్లు చదవాలని, 3, 4 సెమిస్టర్లు మాత్రం ఎంబీఏ పేపర్లతో పాటు కోర్ టూరిజం పేపర్లు ఉంటాయని అన్నారు. ఈ కోర్సులో భాగంగా ఇప్పటి వరకు విద్యార్థులకు రామోజీ ఫిల్మ్ సిటీ వంటి సంస్థల్లో 60 రోజుల ఇంటర్న్ షిప్ చేయించామని, స్టడీ టూర్లని ఏర్పాటు చేసి ఢిల్లీ, పాండిచ్చేరి, కేరళ వంటి ప్రదేశాలకు తీసుకెళ్ళి పర్యాటక రంగంలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై ప్రత్యక్ష అవగాహన కల్పించామన్నారు. గతంలో మన యూనివర్సిటీలో ఈ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు థామస్ కుక్, ఎస్ఓటీసీ, సదరన్ ట్రావెల్స్, యాత్ర, మేక్ మై ట్రిప్ వంటి సంస్థల్లో ఉపాధి పొందారన్నారు. ప్రస్తుతం ఐసెట్ వెబ్ కౌన్సెలింగ్ జరుగుతున్న నేపథ్యంలో జిల్లా విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాల్సిందిగా కోరుతున్నామని, వివరాలకు 99859 90637 ఫోన్ నెంబర్‌ను సంప్రదించవచ్చని కోరారు.

# ఆంధ్ర రాజకీయ తెరపై... మళ్ళీ 'తెలుగుసేన'

**రాజకీయాలలో కుప్పిగంతులు, కప్పగెంతులూ సర్వ సాధారణం. ఎవరెవరి అవసరాలను, అవకాశాలను బట్టి వారు మారిపోతూ ఉంటారు. పార్టీలు మార్చేస్తూ ఉంటారు. ప్రస్తుతం ఆ బాపతుకు చెందిన నాయకులలో మొదటిస్థానంలో పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ నిలుస్తున్నారు. తన అన్న చిరంజీవి ఛరిష్మాతో, ఆయన పలుకుబడితో సినిమా రంగంలోకి వచ్చిన పవన్ సంచలనాత్మక చిత్రాలలో నటించి నటుడిగా తనకంటూ ఒక ఇమేజ్ సంపాదించుకున్నారు. అన్న చిరంజీవి పెట్టిన సినిమా భిక్షతో ఆ రంగంలో బాగా రాణించిన పవన్ అదే అన్న స్ఫూర్తితో రాజకీయాలలోకి వచ్చాడు. 2014 మార్చి 14న 'జనసేన' పార్టీ పెట్టి భాజపా – తెలుగుదేశంలతో కలిసి కాంగ్రెసును ఓడించ డానికి, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రాకుండా అడ్డుకోవడానికి రాష్ట్రమంతా సుడిగాలి పర్యటనలు చేశారు. భాజపా – తెదేపాలను బలపరిచాడే తప్ప, ఆయన, ఆయన పార్టీ ఎక్కడా పోటీకి దిగలేదు. అప్పుడే ఆయనపై 'ప్యాకేజ్ స్టార్' అనే ఆరోపణలు వెల్లువెత్తాయి.**



2014 ఎన్నికల అనంతరం రాష్ట్రం విడిపోయింది. తెలంగాణ నుండి విడగొట్టిన కొత్త రాష్ట్రం అనాధాంధ్రగా మిగిలిపోయింది. అలాంటి తరుణంలో సీనియర్, అనుభవశాలి '40 సంవత్సరాల ఇండస్ట్రీ' చేతిలో రాష్ట్రాన్ని పెడితే నవ్యాంధ్రని స్వర్ణాంధ్ర చేస్తారన్న ఆశతో ప్రజలు తెలుగుదేశాన్ని గెలిపించారు. అయితే తనవల్లే బాబుని జనం గెలిపించారన్న అపోహకు పవన్ కళ్యాణ్ లోనయ్యారు.

ఇంకొకరిని గెలిపించే స్థాయిలో మనం ఉంటే మనమే స్వయంగా నిలబడితే ఎందుకు గెలవలేం...? కింగ్‌మేకర్ అయ్యాం.. కింగ్ కాలేమా..? అన్న పిచ్చి భ్రమ ఆయన చేత 2019 ఎన్నికల్లో పోటీ చేసేలా చేసింది. జనసేన పార్టీ తరపున అభ్యర్థులను నిలబెట్టారు. గుంటూరు శేషేంద్రశర్మ రాసిన పుస్తకాలలో నాలుగు డైలాగులు బట్టీ పట్టుకుని ప్రజల ముందుకు వచ్చారనే భావన కల్పించారు.

ఆ ఎన్నికలలో ఒంటరిగా పోటీచేసి కేవలం ఒక్క సీటుకి ఆయన పార్టీ పరిమితమైపోయింది. తాను స్వయంగా నిలబడ్డ రెండుచోట్లా ఆయన ఓడిపోయారు. అక్కడితో ఆయన రాజకీయ చిత్రం క్లోజ్ అని అప్పట్లో అందరూ అనుకున్నారు. కానీ, ఆయన ఎక్కడా తగ్గలేదు. అప్పుడప్పుడూ నేనున్నానంటూ గర్జిస్తూ రాష్ట్ర రాజకీయాలలో కొనసాగుతూనే ఉన్నారు.

## గర్జన - ఘర్షణ

తాజాగా రాష్ట్రంలో జరిగిన నాటకీయ రాజకీయ పరిణామాలతో ఆయన పూర్తిగా నవ్వులపాలయ్యారనే విమర్శలు వచ్చాయి. నిజానికి వైసీపీ విశాఖలో చేపట్టిన 'విశాఖ గర్జన' బ్రహ్మాండంగా జరిగింది. రాజకీయేతర జేఏసి వేదికపై అందరూ రాజకీయ నాయకులే పాల్గొన్నా, భారీ వర్షంలో సైతం జనం కూడా బాగానే వచ్చారు. అయితే, అదేరోజు సాయంత్రం 'జనవాణి' కార్యక్రమంలో పాల్గొనడానికి పవన్ విశాఖ రావడం, విమానాశ్రయంలో గొడవ జరగడంతో 'గర్జన' కాస్తా తెరవెనుకకు వెళ్ళి ఘర్షణ తెరపైకి వచ్చింది. అయ్యో.... వైసీపీ సెల్ఫ్‌గోల్ వేసుకుందా అని విశ్లేషకులు కంగారుపడ్డారు. అయితే అంతలోనే విజయవాడలో పవన్ కళ్యాణ్ వాడిన సినిమా డైలాగులతో ఆయనతో పాటు ఆయన పార్టీ శ్రేణులు కూడా బొక్కబోర్లా పడ్డారు. దర్శకుడు, సెట్టింగులు, మేకప్, లైటింగ్, కెమెరా లేకుండానే, ఎవరూ యాక్షన్ అని చెప్పకుండానే కార్యకర్తల సమావేశంలో గొప్పగా నటించారని నెటిజన్లు విరుచుకుపడ్డారు.

"తోలు వలుస్తా, చెప్పుతో కొడతా, గొంతు పట్టి నులిమి తొక్కుతా వైసీపీ కొడకల్లారా" అంటూ ఆయన చెప్పిన డైలాగులు విని జనం బిత్తరపోయారు. తాను ఒక పార్టీకి అధ్యక్షుడనని కూడా పవన్ మర్చిపోయారన్న విమర్శలు వెల్లువెత్తాయి. అచ్చం సినిమాల్లో చెప్పినట్లే.. కెమెరా ముందు నటించినట్లే వ్యవహరించి తన పతనానికి తానే పథకం రచించుకున్నారా...? అనే అనుమానాలు కాపు సామాజికవర్గంలో సైతం వ్యక్తమయ్యాయి.

ఇదే క్రమంలో పలకరింపు పేరుతో విజయవాడలోని నోవాటెల్ హోటల్లో ఉన్న పవన్‌ని చంద్రబాబు కలవడం పవన్ అంతరంగాన్ని బయటపెట్టేసింది. ఈ రెండు సంఘటనలు వైసీపీకి బాగా కలిసొచ్చాయి. బాబు దత్తపుత్రుడిగా పవన్‌ని అభివర్ణిస్తున్న వైసీపీ నాయకులకు ఊతం చిక్కింది. 'ముసుగు తొలగింది' అంటూ ఎద్దేవా చేశారు. తాము ఎప్పటినుండో చెప్తున్న విషయం ఇప్పుడు తేటతెల్లమయింది... అంటూ ధ్వజమెత్తారు. ప్యాకేజీ వ్యవహారం లీకేజీ దాకా వచ్చేసిందని అవహేళన చేశారు.

ఏతా వాతా తేలిందేమిటంటే ఆంధ్ర రాజకీయ తెరపై మళ్ళీ 'తెలుగుసేన' అవతరించబోతోంది. ఇప్పటికే భాజపాతో ఉన్న జనసేనాని అక్కడ కొనసాగినా, లేకపోయినా తెలుగుదేశంతో మాత్రం దోస్తీ ఖాయమని తేలిపోయింది. జనసేన కాస్తా "తెలుగుసేన"గా మారి, రానున్న ఎన్నికలలో పోరాడబోతోందని స్పష్టమైపోయింది. ఇక తేలాల్సిందల్లా 'కమలం' విషయమే. కమలం కూడా వీరితో కలిసి నడుస్తుందా..? లేక పవన్‌తో కూడా తెగతెంపులు చేసుకుని, తెరవెనుకనుండి వైకాపాకి అండగా నిలుస్తుందా..?? అన్నది తేలడానికి మరికొంత కాలం వేచి చూడాల్సిందేనని పరిశీలకులు అంటున్నారు.

## దీపావళి..24నే

దీపావళి పండుగ ఏరోజు జరుపుకోవాలనే సందేహాలకు తెరదించారు టిటిడి ఆగమ సలహాదారు శ్రీ విష్ణుభట్టాచార్యుల వారు. ఈనెల 24వ తేది సోమవారం సాయంత్రం అమావాస్య మొదలవుతుంది కనుక, సూర్యాస్తమయం సమయానికి గంట ముందుగా అమావాస్య ఘడియలు ప్రారంభమవుతుండడంతో, అదేరోజున దీపావళి జరుపుకోవాలని ఆయన సూచించారు.

# కాంగీకి 137.. ఖర్గేకి 80

## జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మల్లికార్జున ఖర్గే



**దేశాన్ని ఏళ్లతరబడి ఏలిన కాంగ్రెస్ పార్టీ, దేశ చరిత్రలోనే కనీవినీ ఎరుగని విధంగా ఇప్పుడు రాజకీయంగా అధః పాతాళంలో పడి, అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్ని ఎదుర్కొంటున్న తరుణంలో, ఎట్టకేలకు తమాయించుకుంటూ తిరిగి నిలబడేందుకు పార్టీ సమాయత్తమవుతోంది. ఒకవైపు 52 ఏళ్ళ రాహుల్‌గాంధీ 'భారత్‌జోడో' యాత్రలో ఉత్సాహంగా ఉరకలు వేస్తుంటే, మరోవైపు 137 ఏళ్ళ కాంగ్రెస్‌పార్టీకి 98వ అధ్యక్షునిగా 80 ఏళ్ళ దళిత నేతకు పీఠం లభించడం విశేషం. దాదాపు 24 ఏళ్ళ తర్వాత గాంధీకుటుంబానికి చెందకపోయినా, ఆ కుటుంబ విధేయుడిని అధ్యక్ష పదవిలో కూర్చోబెట్టనున్న అపూర్వ దృశ్యం ఆవిష్కారం కానుంది.**

అక్టోబరు 19..జాతీయ కాంగ్రెస్ పార్టీకి అధ్యక్ష ఎన్నికలు జరిగాయి. అందరూ అనుకున్నట్లుగానే, గాంధీకుటుంబానికి పరమవిధేయుడైన కర్నాటక సీనియర్ కాంగ్రెస్ నేత, దళిత కుటుంబానికి చెందిన మల్లికార్జున ఖర్గేకి కాంగ్రెస్ అధ్యక్ష పీఠం లభించింది. పోటీలో ఉన్న తిరువనంతపురం ఎంపీ శశిథరూర్‌పై ఖర్గే విజయం సాధించడం వెనుక కాంగ్రెస్ అధిష్టానం ఆశీస్సులు ఖర్గేకి పుష్కలంగా ఉండడమేనన్నది అందరికీ తెలిసిందే. ఖర్గే అధ్యక్షునిగా ఎన్నిక కాగానే కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ, ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఢిల్లీలోని ఖర్గే నివాసానికి వెళ్లి అభినందించారు కూడా. పార్టీలో ఎంతో అనుభవం ఉన్న నేతగా ఖర్గే విజయం కాంగ్రెస్ అధినేతల్లో కొంత ఉత్సాహాన్ని కలిగిస్తోంది. రాహుల్ గాంధీ కూడా ఆయన పట్ల సంతోషంగా ఉన్నారు.

లోక్‌సభలో మాజీ ప్రతిపక్ష నాయకునిగా, రాజ్యసభలో ప్రస్తుత ప్రతిపక్ష నేతగా ఉన్న ఖర్గేకి అపారమైన రాజకీయ అనుభవంతో పాటు జాతీయ, అంతర్జాతీయ విషయాల పట్ల మంచి అవగాహన ఉంది. పార్టీలో దాదాపు 50 ఏళ్ల అనుభవం ఉంది. జాతీయ స్థాయిలో పార్టీని నడిపించగలిగిన సమర్థత ఉంది. బిజెపిని ధీటుగా ఎదుర్కొనే సత్తా కూడా ఉంది. అందుకే ఏరికోరి ఖర్గేను కాంగ్రెస్ అధిష్టానం ఎంపిక చేసుకుంది. ఎంత విధేయత్వం ఉన్నా పార్టీలో కొన్ని సొంత నిర్ణయాలు తప్పవు. అధ్యక్షునిగా బాధ్యతలు తీసుకున్నాక అన్ని పరిస్థితులనూ అంచనా వేసుకుని, అందరినీ కలుపుకుని ముందుకు పోవాల్సి ఉంటుంది. ఆ ఓర్పూ–నేర్పూ ఖర్గేలో బాగా ఉండబట్టే ఆయనకు నేతల ఆశీస్సులు లభించాయంటున్నారు.

దేశంలో ఇప్పటికే గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్ ఎన్నికలు సిద్ధంగా ఉన్నాయి. ఆ తర్వాత మూడు ఈశాన్య రాష్ట్రాల్లోనూ ఎన్నికలున్నాయి. ఈ మూడింటిలో ఖర్గే సొంతరాష్ట్రం కర్నాటక కూడా ఉంది. అధికారపార్టీగా ఉన్న బిజెపి వీరదూకుడుతో ఎన్నికలయుద్ధంలో అప్రతిహతంగా ముందుకు పోతున్న ప్రస్తుత తరుణంలో, ఇప్పుడున్న రాజకీయ పరిస్థితుల్లో ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించుకుని నిలబెట్టుకోవడమన్నది అంత సులువైన విషయమేమీ కాదు. ఎంతో కసరత్తు చేస్తే తప్ప గెలుపు గుర్రాన్ని అధిరోహించలేం. ఇక్కడే, ఖర్గే రాజకీయ అనుభవం ఏమేరకు ఫలిస్తుందో, పార్టీకి ఎన్ని విజయాలను తెచ్చిపెడుతుందో.. వేచి చూడాల్సిందే. అందుకే రానున్న ఎన్నికలన్నీ కాంగ్రెస్ అధ్యక్షునిగా ఆయన అనుభవానికి పరీక్షలుగా కూడా ఉండబోతున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

## రాహుల్ యాత్రకు.. జనం నుంచి మంచి స్పందన :

ఒకప్పట్లో దేశాన్ని ఏకఛత్రాధిపత్యంగా పరిపాలించిన కాంగ్రెస్ రానురాను స్వయంకృతాపరాధాలతో తననెత్తిన తానే చెయ్యి పెట్టుకుని అధోగతికి చేరిపోయిందన్నది అందరికీ తెలిసిందే. ఏ రాష్ట్రంలో ఎన్నికలొచ్చినా చక్రం తిప్పే కాంగ్రెస్‌కు, ఇప్పుడు ఎన్నికలంటేనే భయపడే స్థితి వచ్చేసింది. గెలుస్తామో లేదోనన్న సంకటంలో పడిపోయింది. బిజెపి అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ఇలాంటి పరిస్థితుల్లో కాంగ్రెస్‌ను ఎలాగైనా తిరిగి నిలబెట్టాలని రాహుల్‌గాంధీ చేస్తున్న 'భారత్ జోడో' యాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుండడం విశేషం. రాహుల్ ఎక్కడికి వెళ్ళినా ప్రజలు పెద్దఎత్తున తరలివస్తుండడం, రాహుల్‌తో పాటు పదంపదం కలిపి నడుస్తుండడం సంచలనంగానే ఉంది. దీంతో కాంగీలో మళ్ళీ కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. అయితే, ఈ ప్రజాదరణ ఏ మేరకు భవిష్యత్తులో తిరిగి కాంగ్రెస్‌కు పూర్వవైభవం రావడానికి తోడ్పడుతుందో.. ఇప్పుడే అంచనా వేయలేం. ఖర్గే అధ్యక్షులయ్యారు కదా.. అని, పార్టీలో ఇప్పుడున్న నిస్తబ్ద పరిస్థితి అంతా వెంటవెంటనే చక్కబడుతుందని కూడా అనుకోలేం. కాలమే..కొన్ని ప్రశ్నలకు సమాధానం! గాంధీకుటుంబేతరుడే అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత ఎన్నికల్లో గెలుపు సాధించడం, అధ్యక్షస్థానం సాధించగలగడం ఖర్గే రాజకీయపరిణితికి నిదర్శనం. ఏదేమైనా ఇది ఆయన అనుభవానికి, ప్రతిభాపాటవాలకి ఒకరకంగా పరీక్షా సమయమే! ఇంట గెలిచినా..రచ్చ గెలవడం ముఖ్యం. పార్టీలో గెలుపు కన్నా దేశంలో పార్టీ గెలవడమే ముఖ్యం!..అదే ఇప్పుడు ఖర్గే ముందున్న ప్రధాన కర్తవ్యం. 137 ఏళ్ళ కురువృద్ధ పార్టీని 80 ఏళ్ళ ఈ వృద్ధ నేత ఏమేరకు పట్టాలెక్కించి పురోగతివైపు పరుగులు పెట్టిస్తాడో.. వేచి చూడాల్సిందే!

# జిల్లాలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు

**నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి**



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో నెల్లూరు జిల్లాలో కోట్లాది రూపాయల వ్యయమయ్యే అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. ఈనెల 20న నెల్లూరులోని కృష్ణపట్నం కాలువ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడారు. నెల్లూరు నగరంలో 400 కోట్లతో నీటిపారుదల కాలువల పనులు చేపట్టారని, అదేవిధంగా 3వేల కోట్లతో రామాయపట్నం పోర్టు పనులు, 500 కోట్లతో ఫిషింగ్‌హార్బర్ పనులు, 100 కోట్లతో నెల్లూరు రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. జిల్లాలో హైవేపై మూడు బ్రిడ్జిలు కూడా ఏర్పాటు కాబోతున్నాయని, తద్వారా ప్రమాదాలు తగ్గుతాయని తెలిపారు. గతంలో టిడిపి హయాంలో వెయ్యికోట్ల రూపాయలతో చేపట్టిన డ్రైనేజీ, మంచినీటి పథకం పనులు పూర్తిచేయకపోయినా, వెయ్యి కోట్ల వడ్డీ భారం కార్పొరేషన్ పై పడిందన్నారు.

## ప్రసన్నకు ఆదాల ప్రశంస :

కోవూరు నియోజకవర్గంలోని జేజేపేటలో ఈనెల 20న జరిగిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఆదాల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదాల కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నను అభినందించారు. ఇప్పటిదాకా ప్రసన్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో 23వేల ఇళ్ళను సందర్శించి, ప్రజలకు ప్రభుత్వ చేస్తున్న సంక్షేమకార్యక్రమాలు వివరించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బట్టేపాటి నరేంద్రరెడ్డి, రావూరు వెంకటశేషయ్య, దేవిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లాయర్
అక్టోబర్ 21, 2022

# నాణ్యత లేని రోడ్లతో.. ఎన్నాళ్లీ పితలాటకం!

దేశంలో రోడ్లే లేని ప్రాంతాల దుస్థితి ఒకవైపు ఉన్నా, కోట్లాదిరూపాయలతో వేస్తున్న రోడ్లలో నాణ్యతాప్రమాణాలు పాటించకపోతుండడంతో రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతూనే ఉండడం విచారకరం. దేశాన్ని అభివృద్ధిపథంలో నడిపించాలంటే రహదారులు ఎంతో కీలకమన్నది అందరికీ తెలిసిందే. అయితే, రోడ్ల నిర్మాణాల్లో నాణ్యతా లోపాలు రానురాను అధికమవుతుండడం, వాటి స్థితిగతులను పట్టించుకునేందుకు సరైన పర్యవేక్షణ లేకపోతుండడంతో అవస్తలు అధికమవుతున్నాయి. కేంద్రప్రభుత్వం ఈ లోపాలు సరిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్తోందో తప్ప ఆచరణలోకి రాకపోవడంతో అనేకచోట్ల రోడ్ల నిర్మాణాలు అస్తవ్యస్తంగానే ఉంటున్నాయి. దేశంలో సుమారు లక్షా 36 వేల కిలోమీటర్ల పొడవునా జాతీయరహదారులున్నాయని, ఇవికాక మరో లక్షా 76 వేల కిలోమీటర్ల పొడవునా రాష్ట్ర హైవేలు, 59 లక్షల కిలోమీటర్ల దాకా ఇతరత్రా రోడ్లు ఉన్నట్లు అంచనా. రోడ్లు ఎంత పొడుగున్నా, అవి సక్రమంగా లేకపోవడమే దారుణం. రోడ్ల ప్రమాదాల్లో ఎందరో చనిపోతున్నా రోడ్ల నాణ్యతను ఎవరూ పట్టించుకోవడం లేదు. ఒక్క 2021లోనే 4 లక్షలకు పైగానే రోడ్డుప్రమాదాలు జరిగాయని, అందులో లక్షా 50వేల మంది దాకా ప్రాణాలు కోల్పోయారని, సుమారు 4 లక్షల మంది దాకా గాయపడ్డారని నిపుణుల అంచనా. అతివేగం, నిర్లక్ష్యంతో వాహనాలు నడపడం వంటివి వాహనదారుల వైపు నుంచి తప్పిదాలైతే, రోడ్లు నాణ్యతగా లేకపోవడం, నిర్మాణ-నిర్వహణ వ్యవస్థలు లోపభూయిష్టంగా ఉండడం ప్రభుత్వాల వైపు నుంచి ప్రధాన కారణాలవుతున్నాయి. ఇకనైనా వీటిని వెంటనే అరికట్టేందుకు గట్టి చర్యలు తీసుకోవాలి. అనేకదేశాల్లో రోడ్లు, భద్రత ఎంత బాగా ఉంటుందో ఆకళింపు చేసుకోవాలి. మనదేశంలో రోడ్లు ఉన్నాయన్న మాటేగానీ, అవి సరిగ్గా ఉన్నాయో లేదో చూసే నాధులు లేరు. ప్రజాధనాన్ని కొల్లగొట్టి డొల్ల రోడ్లు వేసే కాంట్రాక్టర్లకు మనదేశంలో కొదవలేదు. చేయితడపకుంటే తప్ప కాంట్రాక్టర్లకు బిల్లులివ్వని దుర్గతీ ఉంది. దీంతో రోడ్లమీద అవినీతి తారు పరుచుకుంటూ ఉంటోంది. అనేకచోట్ల రోడ్లు, రోడ్లమార్జిన్లు బాగా దెబ్బతినిపోయి ప్రమాదాలు జరుగుతుండడం సర్వసాధారణమైపోయింది. బాధితులు, మృతుల కుటుంబాలు బతికినంతకాలం పడే బాధ ఆ దేవుడికే ఎరుక!..తిలాపాపం తలా పిడికెడు అన్నట్లు ఎవరికి అందింది వారు దోచుకోవడమే తప్ప, చేసే పనిలో నాణ్యత కానీ, నిజాయితీ కానీ ఉండకపోవడం మన వ్యవస్థలో పెద్ద శాపం!..కాసింత కంకరో, తారో, మట్టో వాటి మొఖాన పడేసి రోడ్డు పూర్తయిందనిపిస్తారు. వాడేదంతా నాసిరకం సామగ్రే. బిల్లులు మాత్రం లక్షల్లో దండుకుంటారు. చిన్న వానొస్తే చాలు వాటి బండారం బయటపడుతుంది. ఇక ఆ గుంటల్లోనే వాహనాల ప్రయాణం. అవే ప్రమాదాలకు మూలం. వాటిని బాగుచేయాలనే నెపంతో మళ్ళీ కాంట్రాక్టులు. అనేకప్రాంతాల్లో నాయకులకు, వారి అనుచరులకు ఇవే వరాలవుతున్నాయి కూడా. ప్రతిదశలోనూ అవినీతే!.. కొద్దోగొప్పో పర్యవేక్షణ ఉండబట్టి జాతీయ రహదారులు కొంతవరకు బాగానే ఉంటున్నాయి కానీ, ఇంకా బాగుపడాల్సింది, వాటి బాగుకు చేయాల్సింది ఎంతో ఉంది. సాధారణ రోడ్లయితే పరమ అధ్వాన్నంగా ఉంటున్నాయి. ఇక..గ్రామాల్లో రోడ్ల సంగతి ఇక చెప్పనే అక్కర్లేదు. రోడ్లను నిర్మాణం చేయించే అధికారులు, నాయకులు, కాంట్రాక్టర్లు అందరూ సమన్వయంతో కలసి 'చిత్తశుద్ధితో' పనిచేస్తే తప్ప మంచి రోడ్లు రావు. కానీ, ఎన్నేళ్ళుగా చూస్తున్నా అలాంటి సమన్వయం మాత్రం ఉండడం లేదు. అయినా..రోడ్ల నిర్మాణాల పేరుతో ఇంకా ఎన్నాళ్ళీ పితలాటకం?. తీరు మారాలి..ఈ దురవస్తలు ఇకనైనా పోవాలి. లక్షల కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించే రోడ్ల నిర్మాణాలకు జవాబుదారీతనం లేకపోవడం ఘోరం. ఇకనైనా వాటి నిర్మాణాలకు, పర్యవేక్షణకు, భద్రతకు అన్నిటికీ కలిపి నీతినిజాయితీలతో పనిచేసే అధికార బృందాలను ఎంపిక చేసి, నిపుణులైన వారితో ఒక 'ప్రత్యేక నిర్మాణ వ్యవస్థ' ఉంటే బావుంటుందేమో కేంద్రం ఆలోచించాలి. రోడ్లు ఎక్కడ బాగలేకపోయినా వెంటనే పట్టించుకునే అధికారుల ఆధ్వర్యంలో ఈ వ్యవస్థ ఉండేలా చూడాలి. ఎక్కడైనా ప్రమాదం జరిగితే వెంటనే అంబులెన్స్ పరుగెత్తుతున్న మాదిరిగానే, ఎక్కడ రోడ్డు బాగా లేదని వాహనదారులు ఫోన్‌లో సమాచారం అందిస్తే చాలు.. వెంటనే అక్కడికి వెళ్ళి రోడ్డును బాగుచేసేందుకు రోడ్డు భద్రతా వాహనాలను, అందులో సిబ్బందిని సిద్ధం చేసి ఉంచాలి. దేశవ్యాప్తంగా ఈ వ్యవస్థ అందుబాటులోకి రావాలి.

# చుక్కలు చూపిస్తున్న కుక్కలు



విశ్వాసానికి పెట్టిందిపేరు.. శునకం. 'కుక్కకున్న విశ్వాసం కూడా నీకు లేదురా' అని తిట్టడం కూడా కొన్ని సందర్భాల్లో మనం వింటుంటాం. 'జాలి గుండె లేని కొడుకు కన్న.. కుక్క మేలురా'... అని ఒక సినీకవి ఎప్పుడో రాశాడు. ఇప్పుడే కాదు, ప్రాచీనకాలం నుంచి కూడా కుక్కలు జనజీవనంలో కలిసిపోయివున్నాయి. వాటిని మననుంచి వేరుగా విడదీసి చూడలేం. అనాదిగా కుక్కలంటే ప్రేమగా పెంచుకునేవారు కోకొల్లలు. ఇంట్లో ఎవరూ లేకున్నా ఒక్క కుక్క ఉంటే చాలు.. ఎంతో భద్రంగా ఉన్నట్లే. పల్లెల్లోనే కాదు, పట్టణాలు, మహా నగరాలలో సైతం వాటిపట్ల ఎంతో ప్రేమ కనపరిచేవారు లక్షల్లో ఉన్నారు. వీధుల్లో.. ఏ వీధికావీధి మనదే అన్నట్లుగా ఠీవిగా తిరిగే కుక్కలు 'గ్రామసింహాలు'గా ఉంటూ, ఆ వీధిలోకి కొత్తవారు ఎవరొచ్చినా, లేదూ పక్కవీధి కుక్కలు వచ్చినా అరచి గీపెట్టి గోల చేసేస్తాయి... సరిహద్దు పోరాటాలకు కూడా దిగుతాయి. నెల్లూరుజిల్లాలోని పలు గ్రామాలతో పాటు నెల్లూరు నగరంలో కూడా ఏ వీధి చూసినా ఈ వీధికుక్కల గుంపులు పెరిగిపోతున్నాయి. అయితే, వీటికి సరైన పోషణతో పాటు సంరక్షణ కూడా ఉండదు. పరిసర ప్రాంతాలలో నివసించేవారెవరైనా దయతలచి ఓ ముద్దపెడితే తింటాయి. లేదంటే ఆ వీధిలో

## సమస్యల తో 'రణం'

ఏది దొరికితే అది తిని బ్రతికేస్తుంటాయి. పొరపాటునో గ్రహపాటునో కుక్క కరిస్తే, బాధితులు పడే పాట్లు చెప్పనలవి కాదు. అందులోనూ ఇప్పుడు కుక్కకాటుకు ఆసుపత్రుల్లో సరైన మందులు ఉండడం లేదు. ఒక్కోసారి రోడ్ల మీద అడ్డదిడ్డంగా పరుగెడుతూ, వాహన చోదకులకు చుక్కలు చూపిస్తుంటాయి. అవి ఉన్నట్లుండి వచ్చి ఏ బైక్ కింద పడడమో, లేదా వాటిని తప్పించడానికి బైక్‌లలో ఉన్నవారే కిందపడడమో వంటి సంఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. నగరంలో ఏ సెకండ్ షో సినిమాకో వెళ్లి వచ్చే వారినీ, తాము పనిచేసే సంస్థలలో పనులు ముగించుకుని అర్థరాత్రి ఆలస్యంగా ఇళ్ళకు చేరేవారినీ ఈ కుక్కలు హడలకొడుతున్నాయి.

ముఖ్యంగా జాతీయ రహదారులపైన కూడా ఈ కుక్కల వల్ల ఘోర ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అత్యంత వేగంగా వెళ్లే కార్లకు ఉన్నట్లుండి కుక్కలు అడ్డం వస్తున్నాయి. కుక్కే కదా అని బ్రేకు వేయకుండా వెళ్తే ఒకవైపు కుక్క చనిపోవడమే కాకుండా మరోవైపు వాహనదారుడికి భారీ నష్టం జరుగుతుంది. అదే పెద్ద వాహనమయితే కుక్క బలైపోతుంది తప్ప వాహనానికి ఏమీ కాదు. కానీ, కార్లకు అలా కాదు. ఊహించని నష్టం కలుగుతుంది. ఒకవేళ అయ్యో కుక్క అని అడ్డమొచ్చే కుక్కని కాపాడే ప్రయత్నంలో వాహన చోదకులు బ్రేకులు వేసినా, లేదా వాహనాన్ని ఒక్కసారిగా పక్కకు తిప్పినా ఇంకా పెద్ద ప్రమాదం జరిగే అవకాశాలు కూడా లేకపోలేదు. ఇప్పటికే అనేక సందర్భాలలో ఇలా కుక్కలను కాపాడబోయి మనుషులు తమ ప్రాణాలమీదకు తెచ్చుకున్న సంఘటనలు చాలానే ఉన్నాయి. అత్యంత అధునాతన పరిజ్ఞానంతో హైవేలు నిర్మించి టోలు వసూలు చేస్తున్న హైవే నిర్వాహకులు, కాంట్రాక్టర్లు రోడ్డుకి ఇరువైపులా ఫెన్సింగ్ వేసి కుక్కలు తదితర మూగజీవాలు రహదారుల పైకి రాకుండా నివారించాలి. నగరాలలో సైతం కుక్కలు ప్రమాదాలకి బలికాకుండా, వాటివల్ల ఎవరికీ హాని జరగకుండా వాటిని సంరక్షణ కేంద్రాలకు తరలించాలి. ఈ బాధ్యత నగర కార్పొరేషన్‌దే. నగరంలో అక్కడక్కడా జంతుసంరక్షణ కేంద్రాలున్నాయి. కానీ, అవి చాలవు. పెంపుడు కుక్కలకు ఆరోగ్యం బాగాలేకపోతే ఆసుపత్రులకు తీసుకువెళ్తుంటారు, కానీ వీధికుక్కలకు ఏ దిక్కూ లేదు. గాయాలు తగిలినా, ఏదైనా అనారోగ్యం వచ్చినా వాటిని పట్టించుకునేవారే లేరు. మనతోపాటు సమాజంలో కలసి జీవిస్తున్న వీధికుక్కలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలతో పాటు ప్రజలకి కూడా ఉంది. అదే సమయంలో వాటివల్ల ఎలాంటి నష్టం జరగకుండా చూసుకోవలసిన ఆవశ్యకత కూడా ఉంది. ముఖ్యంగా జంతు ప్రేమికులు, స్వచ్ఛంధ సంస్థల నిర్వాహకులు సమిష్టిగా కృషిచేసి ఆ మూగజీవాలను పరిరక్షించేందుకు, వాటివల్ల ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటే అటు కుక్కలకు, ఇటు ప్రజలకి కూడా మేలు జరుగుతుంది..!

- సంచారి

# కోట్లు తినేస్తున్నా పట్టించుకునేవారే లేరా?..




ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి ట్రాన్సాక్షన్ జరగాలన్నా సవాలక్ష ప్రశ్నలు, నిబంధనలుంటాయి. బోలెడన్ని పరిశీలనలు ఉంటాయి. అందులోనూ ఇప్పుడున్న ఆన్‌లైన్ విధానంలో ఎప్పుడు, ఎవరికి ఎంతెంత ఇచ్చారో కచ్చితమైన సమాచారం ఉంటుంది. ఎంత డబ్బు ఎవరికి చేరిందో కచ్చితమైన లెక్కలుంటాయి. ఇంత సాంకేతిక పరిజ్ఞానం ఉన్నా ఒక ప్రభుత్వసంస్థలో ఇంత భారీగా కోట్లాది రూపాయల కుంభకోణం జరిగిపోవడం చూస్తే, అసలిదెలా సాధ్యమైందో ఊహకు కూడా అందడం లేదు. అందులోనూ రైతులకి ఇవ్వాల్సిన డబ్బులు, హమాలీలకు చెల్లించాల్సిన డబ్బులు కోట్లాది రూపాయలు స్వాహా కావడం విచిత్రంగా ఉంది. దాదాపు 30 కోట్ల దాకా తినేశారని అంటున్నారు. ఇంతపెద్ద ఎత్తున ప్రజల డబ్బును అవినీతిపరులు గాదెకింద పందికొక్కుల్లా అప్పనంగా స్వాహా చేసేస్తున్నా, ఏళ్ళ తరబడిగా ఈ అవినీతి బాగోతం జరిగిపోతూనే ఉన్నా ఎవరూ పట్టించుకోకపోవడం దారుణం. దీనివల్ల జిల్లా ఉన్నతాధికారులకు, ప్రభుత్వ సంస్థలకు, ప్రభుత్వానికి కూడా అప్రదిష్టే కదా!.. ఎక్కడో మారుమూలన కాదు, నెల్లూరు నగరం నడిబొడ్డున ఉన్న సివిల్ సప్లయిస్ కార్యాలయంలో ఇంత పెద్ద కుంభకోణం జరుగుతున్నా ఎవరికీ ఇంతకాలంగా పోబిడీ రాకపోవడం ఏమిటి?.. ఈ భారీ అవినీతి వెనుక ఎంతమంది ఉన్నారో జిల్లా ఉన్నతాధికారులు విచారణ చేయించాలి. ప్రభుత్వం మేలుకొని కొరడా ఝుళిపించకుంటే ఇవి అన్నిచోట్లా మామూలైపోతాయి. అవినీతిపరుల భరతం పట్టాలి. ఇలాంటి కుంభకోణాలు ఇక ఎక్కడా జరగకుండా ప్రతిచోటా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకబృందాలతో పర్యవేక్షణ పెట్టాలి. ముఖ్యంగా ప్రతినెలా ఆడిట్ బృందాలను పంపి అన్నిశాఖలు, అన్ని సంస్థల్లో లెక్కలన్నీ సరిగ్గా ఉన్నాయో లేదో చూడాలి. ఎంత డబ్బు ఎక్కడికి పోతుందో ఆ లెక్కలన్నీ ఎప్పటికప్పుడు నిగ్గు తేలుస్తూ ఉండాలి. అవసరమైతే అందుకు 'ప్రత్యేక పర్యవేక్షక శాఖ', లేదా ఒక ప్రత్యేక వ్యవస్థకు రూపకల్పన చేయాలి. లేకుంటే ఇలాంటి కుంభకోణాలను అరికట్టడం ఎవరి తరం కాదు.

– ఎస్ వెంకటసుబ్బయ్య, **కోవూరు.**

# ప్రాంతీయ విద్వేషాలు మంచిది కాదు!

గతవారం 'లాయర్' మొదటి పేజీలో రాసిన 'రాజకీయాల పడగలో రాష్ట్రం'లో విశ్లేషణ బాగుంది. అధికార పార్టీ అయినా ప్రతిపక్ష పార్టీలైనా ప్రజల మనోభావాలు పట్టించుకోవాలి. ప్రజాశ్రేయస్సు గురించి ఆలోచించాలి. పట్టు, విడుపు రెండూ అవసరమే. అలాగే అవసరమైన చోట తగ్గాలి. అందుకు విరుద్ధంగా మొండిగా వ్యవహరిస్తే ఎవరికీ మంచిది కాదు. వివాదం ముదిరి, విద్వేషాలకు దారితీయక ముందే సమస్య పరిష్కార దిశగా అందరూ ఆలోచించాలి. రాష్ట్ర విభజన తరువాత అన్ని విధాలుగా నష్టపోయి అనాధగా మారింది ఆంధ్రప్రదేశ్. విభజన జరిగి ఎనిమిదేళ్లు దాటినా ఇంతవరకు మనం గర్వంగా చెప్పుకోదగిన అంశం ఒక్కటీ లేదు. ఇలాంటి తరుణంలో ప్రాంతీయ విద్వేషాలు పెరిగి గొడవలు జరిగితే అది రాష్ట్ర భవిష్యత్తుకు మంచిది కాదు. అలా జరిగితే రాష్ట్రం మరో అర్ధ శతాబ్దం వెనుకబడిపోతుంది. ఆ పాపం మూటకట్టుకోకుండా, రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అన్ని రాజకీయ పార్టీలు ఏకమై రాజధాని విషయంలో సమిష్టి నిర్ణయం తీసుకుంటే బాగుంటుంది.

జి.వి.సుబ్బయ్య, **పిడుగురాళ్ల.**

# హైవే దాటాలంటే హడలిపోతున్నాం..!

నెల్లూరు నుండి గొలగమూడికి వెళ్లాలంటే పెద్ద బైపాస్ దాటి వెళ్ళాలి. నేను మా కుటుంబం గత ముప్పై సంవత్సరాలుగా ప్రతి శనివారం ఆనవాయితీగా గొలగమూడికి వెళ్తున్నాం. నెల్లూరు నుండి కనుపర్తిపాడు మీదుగా గొలగమూడికి వెళ్లాలంటే ఇప్పుడు భయపడిపోతున్నాం. రాత్రి వేళల్లో తిరిగి వచ్చేటప్పుడైతే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రోడ్డు దాటాల్సి వస్తుంది. విపిఆర్ కళ్యాణమండపానికి ఎవరైనా ప్రముఖులు వస్తున్నప్పుడు మాత్రం పోలీసు వారు అక్కడే వుండి ట్రాఫిక్‌ని అదుపు చేస్తున్నారు. మిగతా దినాలలో పట్టించుకోవడంలేదు. కనీసం శనివారాలైనా గొలగమూడికి వచ్చిపోయే భక్తులకోసం హైవే కూడలి వద్ద భద్రత కల్పిస్తే బాగుంటుంది. ఇక్కడ కూడలి ఉన్నప్పటికీ వాహనాల వేగం తగ్గడంలేదు. గతంలో ఇక్కడ పెద్ద ప్రమాదం జరిగి నాలుగు ప్రాణాలు ఆహుతైపోయాయి. ఈ కూడలిలో ఫ్లైఓవర్ వస్తుందని పేపర్లలో చదువుతూనే ఉన్నాం. అలాంటి ఛాయలు అక్కడేం కనపడడంలేదు. పెద్దలు దయదలచి పోలీసువారితో మాట్లాడి భక్తుల ప్రాణాలు కాపాడాలని కోరుతున్నాను.

– ఎం.శ్రీనివాసులు, **దర్గామిట్ట.**

నవంబరు 1 నుంచి..

# ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధం

## అమలుకు సహకరించాలన్న జడ్పీ ఛైర్‌పర్సన్




జిల్లాలో పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ ఫ్లెక్సీ బ్యానర్ల నిషేధం అమలుకు సహకరించాలని జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఆనం అరుణమ్మ పిలుపునిచ్చారు. ఇటీవల నెల్లూరులోని జడ్పీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబుతో కలిసి ప్లాస్టిక్ ఫ్లెక్సీ బ్యానర్ల నిషేధం అమలుపై మున్సిపల్ కమిషనర్లు, జిల్లా అధికారులు, ఫ్లెక్సీ ప్రింటర్ల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణమ్మ మాట్లాడుతూ, ప్లాస్టిక్ వాడకం మంచిది కాదన్నారు. ప్రమాదకరమైన రసాయనాలను ఫ్లెక్సీల తయారీలో వాడటం జరుగుతోందని, దీంతో జంతువులు ప్రమాదాల బారిన పడుతున్నాయన్నారు. ముఖ్యంగా క్యాడ్మియం, సీసం వాడకం వలన అవి భూమిలో కలిసిపోవడం లేదన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి భూమిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఫ్లెక్సీ ప్రింటింగ్ యజమానులు అందుకు సహకరించాలన్నారు. తొలుత, కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే పదార్థాలను ఫ్లెక్సీ బ్యానర్లలో వాడుతున్నందున వాటిని నిషేధించాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారన్నారు. నవంబర్ ఒకటో తేదీ నుండి ఫ్లెక్సీ బ్యానర్లను నిషేధాన్ని అమలుచేస్తామన్నారు. ఇకనుంచి పర్యావరణహితమైన నూలు వస్త్రాలపై బ్యానర్లు తయారు చేయాలన్నారు. ప్రస్తుతం నూలు వస్త్రాలపై బ్యానర్ల తయారీ ధరలు ఎక్కువగా ఉండొచ్చని, రాను రాను వాడకంలో ఆ ధరలన్నీ తగ్గుతాయన్నారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ కమిషనర్ డి. హరిత, ఏఎస్పీ హిమవతి, డిఆర్ఓ వెంకటనారాయణమ్మ, జడ్పీ సిఇఓ చిరంజీవి, డిటిసి బి.చందర్, డిపిఓ ధనలక్ష్మి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కనక దుర్గ భవాని, కాలుష్య నియంత్రణ మండలి ఏఇ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే..

# ప్రభుత్వ ధ్యేయం

'గడప గడపలో'.. మంత్రి కాకాణి



ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తమ వైకాపా ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రభుత్వం ప్రజలకు అన్నివిధాలా మేలు కలిగే అనేకరకాలైన సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తూ ప్రజల ఆదరణ పొందుతోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఈనెల 18న 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఆయన తోటపల్లిగూడూరులో పర్యటించి ప్రజలను కలుసుకుని మాట్లాడారు. ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.

# విజయం సాధించాలి

-- మేయర్ పిలుపు --

రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైకాపా అభ్యర్థులు శ్యాంప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి విజయం సాధించేలా ప్రతి ఒక్కరూ కృషిచేయాలని నగర మేయర్ పొట్లూరి స్రవంతి పిలుపునిచ్చారు. ఈనెల 18న ఆమె ధనలక్ష్మీపురంలో ఎన్నికల ప్రాంతీయ కార్యాలయాన్ని ప్రారంభించి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు.




ఆచార్య సిఎంకె రెడ్డికి..

# లీడర్‌షిప్ అవార్డు

చెన్నైలోని ప్రముఖ వైద్యులు, మన నెల్లూరీయులైన ఆచార్య సిఎంకె రెడ్డికి ఇటీవల ప్రతిష్ఠాత్మకమైన లీడర్‌షిప్ అవార్డు లభించింది. తమిళనాడు మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఈనెల 16న చెన్నైలో నిర్వహించిన కార్యక్రమంలో ఆచార్య సిఎంకె రెడ్డి వైద్యరంగానికి చేస్తున్న సేవలను కొనియాడుతూ అవార్డును బహూకరించారు. తమిళనాడు మంత్రి డా.మతివెంతన్ చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకున్నారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ సెంథిల్, సభ్యులు పాల్గొన్నారు. తమిళనాడులో తెలుగుభాషతో పాటు మైనార్టీ వర్గాలకు సంబంధించి మాతృభాషల పరిరక్షణకు ఆచార్య సిఎంకె రెడ్డి చేస్తున్న అవిశ్రాంత కృషితో పాటు, వైద్యరంగంలోనూ ఆయన విస్తృత సేవలందిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయనకు 'లీడర్‌షిప్ అవార్డు' రావడం పట్ల తమిళనాడుతో పాటు తెలుగునాడులోని పలువురు ప్రముఖులు ఆయన్ను అభినందించారు.

# కార్పొరేషన్ జమాఖర్చులన్నీ.. ఇక ఆన్‌లైన్‌లో

నెల్లూరు నగరపాలక సంస్థకు సంబంధించిన అన్ని విభాగాల జమాఖర్చులు క్రమపద్ధతిలో పారదర్శకంగా నిర్వహించి, అన్ని పద్దులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కార్పొరేషన్ కమిషనర్ హరిత సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 18న కార్యాలయంలోని అకౌంట్స్ విభాగం అధికారులు, సిబ్బందితో కమిషనర్ సమావేశమై అకౌంట్స్ వివరాలను పరిశీలించారు. సమగ్రమైన వివరాలతో బిల్లులన్నీ పెండింగ్ లేకుండా చూడాలని ఆమె అధికారులకు స్పష్టం చేశారు.

# మతసామరస్యానికి ప్రతీక.. కసుమూరు దర్గా

## ఈనెల 22 నుంచి వైభవంగా గంధోత్సవాలు



'కసుమూరు మస్తానయ్య'ంటే జిల్లాలోనే కాదు, దేశవ్యాప్తంగా గొప్ప పేరు. మస్తాన్‌వలీ దర్గా అంటే మత సామరస్యానికి మారుపేరు. జిల్లాలో ప్రముఖ పుణ్యస్థలంగా, మహిమాన్విత క్షేత్రంగా పేరొందిన వెంకటాచలం మండలంలోని కసుమూరు దర్గాలో ఈనెల 22 నుంచి మూడురోజుల పాటు అత్యంత వైభవంగా 245వ గంధమహోత్సవాలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా కసుమూరులోని మస్తాన్‌వలీ (హజరత్ సయ్యద్ కరీముల్లాషా ఖాద్రీ, ఉరఫ్ కాలేషా పీర్ మస్తాన్‌వలీ) దర్గాను శోభాయమానంగా తీర్చిదిద్దుతున్నారు. భక్తులకు కొంగుబంగారంగా వెలసివున్న ఈ దర్గాకు జిల్లా నుంచే కాక, ఇతర రాష్ట్రాల నుంచి, దేశంలోని అనేక ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తుంటారు. కరోనా కారణంగా గత రెండేళ్ళుగా గంధోత్సవాలు నిర్వహించలేదు. ఇప్పుడు భారీఎత్తున నిర్వహించే ఈ ఉత్సవాలకు కనీసం రెండు లక్షలమందికి పైగానే భక్తజనులు తరలివస్తారని అంచనా వేస్తున్నారు. అందుకు తగ్గట్టుగా జిల్లా అధికార యంత్రాంగం, ఆలయనిర్వాహకులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 18న జిల్లా మైనార్టీ శాఖ అధికారి కనకదుర్గాభవాని కసుమూరులో అన్నిశాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, గంధోత్సవానికి చేయాల్సిన ఏర్పాట్లను చర్చించారు. ముఖ్యంగా తాగునీటి వసతి, విద్యుత్, పార్కింగ్, పారిశుద్ధ్యం, తాత్కాలిక మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలన్నీ ఏర్పాటుచేయాలని, అధికారులంతా సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ సుస్మితారెడ్డి, వక్ఫ్‌బోర్డు ఇన్స్‌పెక్టర్ అహ్మద్‌బాషా, సర్పంచ్ శివకుమార్, జిల్లా వైకాపా అధికారప్రతినిధి మందల వెంకట శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

# 'తంగిరాల మహాభారతం' 26వ భాగం




కుంతి ఒకరోజు గంగాస్నానానికి వచ్చి, దుర్వాసుడు ఇచ్చిన ఆ మంత్రశక్తిని పరీక్షిద్దామని సూర్యుణ్ణి చూసి ఆయన్ను తలచుకోగానే, సూర్య భగవానుడు ప్రత్యక్షమై ఒక పసివాణ్ణి ప్రసాదిస్తాడు. కుంతి భయపడిపోయి బంధువులు హేళన చేస్తారని అప్పుడే అక్కడికి వచ్చిన బంగారు పెట్టెలో ఆ పిల్లవాణ్ణి పెట్టి దుఃఖంతో వెనక్కు వెళ్ళిపోతుంది. ఆ పెట్టె గంగానదిలో తేలుకుంటూపోయి ఒక సూతుడికి దొరుకుతుంది. ఆయన, ఆయన భార్య రాధ ఎంతో సంతోషపడి, ఆ పిల్లవాణ్ణి పెంచుకుంటారు. ఆయనే కర్ణుడు. కొంతకాలానికి కుంతికి స్వయంవరం జరిగినప్పుడు, ఆమె పాండురాజుని చూసి, ఆయన మెళ్ళో పూలహారం వేస్తుంది. తర్వాత వాళ్ళిద్దరికి వివాహం జరుగుతుంది. భీష్ముడు, మద్రరాజ కుమార్తె మాద్రిని కూడా తెచ్చి పాండురాజుకిచ్చి వివాహం చేస్తాడు.

పాండురాజుకి వేట అంటే అమితమయిన ఇష్టం. ఒకసారి కుంతిని, మాద్రిని వెంటబెట్టుకుని అడవిలోకి వెళ్లి అక్కడ విడిదిచేసి రోజూ అడవిలో ఉన్న జంతువుల్ని వేటాడుతూ ఉంటాడు. ఒకరోజు ఒక్క జంతువు కూడా దొరకలేదు. విసిగిపోయి ఉన్న సమయంలో రెండు జింకలు కామక్రీడలో విహరిస్తుంటాయి. పాండురాజు ఆలోచించకోకుండా వాటి మీద 5 బాణాలు వేస్తాడు. ఆ రెండు జింకలు కుప్ప కూలిపోతాయి. వాటిలో మగ జింక మనుష్య భాషలో.. తాను కిందముడు అనే మునీశ్వరునని, తాను, తన భార్య జింకల రూపంలో కామసుఖాలు అనుభవిస్తున్నామని, చెప్పి పాండురాజుని ఎందుకిలా చేశావు, అధర్మం కాదా అని అడిగినప్పుడు పాండురాజు తాను చేసిన పని సమర్థించుకుంటాడు.

అప్పుడు మునీంద్రునికి కోపం వచ్చి నీవు కూడా నీ భార్యలతో సాంగత్యం చేసినప్పుడు నీవు, నీ భార్య కూడా మరణిస్తారని శపిస్తాడు. ఆ తర్వాత ముని దంపతులిద్దరు మరణిస్తారు.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది. పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.



# సాగునీటి సమావేశం..23న

జిల్లా సాగునీటి సలహామండలి సమావేశాన్ని అక్టోబరు 23న నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరోజున ఉదయం 10 గంటలకు నెల్లూరులోని జడ్పీ హాల్‌లో ఈ జరిగే ఈ సమావేశంలో పంటలకు నీటిపారుదల విషయాలను చర్చించనున్నారు. సోమశిల, కండలేరు జలాశయాల్లో పుష్కలంగా నీరు ఉండడంతో పంటపొలాలకు నీటి కొదవలేకుండా కేటాయింపులు జరగవచ్చని భావిస్తున్నారు.

# మూలస్థానేశ్వరుని హుండీ ఆదాయం.. 6.65 లక్షలు

నెల్లూరు మూలాపేటలో ఉన్న భువనేశ్వరిదేవి సమేత శ్రీ మూలస్థానేశ్వర దేవాలయంలో ఇటీవల హుండీ లెక్కించారు. గత జూన్ 18 నుండి అక్టోబరు 15వ తేది వరకు భక్తులు సమర్పించిన కానుకల ద్వారా 6,65,715 రూపాయలు రాబడి వచ్చిందని ఆలయ వర్గాలు తెలిపాయి. ఈ లెక్కింపులో ఆలయ దేవాదాయశాఖ పర్యవేక్షణాధికారి జి.రామకృష్ణ, ఆలయ ఛైర్మెన్ లోకిరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, ఇఓ ఆరంబాకం వేణుగోపాల్, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

# 201 మందికి ఉద్యోగాలు

నెల్లూరులోని వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర ఐటిఐలో ఇటీవల నిర్వహించిన జాబ్‌మేళాలో 201 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఏపిఎస్ఎస్‌డిసి, డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రెయినింగ్, ఎస్ఇఇడిఏపి సంస్థలు సంయుక్తంగా ఈ జాబ్‌మేళాను నిర్వహించాయి. 14 కంపెనీల వారు చేపట్టిన ఈ ఎంపికలకు 699 మంది హాజరయ్యారు. ఎంప్లాయిమెంట్ అధికారి సురేష్‌కుమార్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి విజయ్ వినీల్‌కుమార్, డిఆర్‌డిఏ ఎస్ఇఇడిఏపి జేడిఎం హైమవతి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఆడిట్ అధికారిగా
# తిరుపతయ్య



జిల్లా ఆడిట్ అధికారిగా నెల్లూరు అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ ఎం.తిరుపతయ్యకు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ఉన్నతాధికారులు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతయ్య గతంలో డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్‌గానూ కూడా పనిచేసివున్నారు.

# బాధ్యతలు చేపట్టిన.. బాలాజీనగర్ సిఐ



నెల్లూరులోని బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్ ఇన్స్‌పెక్టర్‌గా రాములునాయక్ ఇటీవల బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా ఎస్పీ విజయారావు తదితర పోలీసు అధికారులను ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా కొత్త సిఐకి ఎస్ఐలు నరేష్, భోజ్యా నాయక్, వేణుగోపాల్ తదితరులు పుష్పగుచ్ఛాలందించి శుభాకాంక్షలు చెప్పారు. రాములు నాయక్ గతంలో నెల్లూరులోని సంతపేట, నార్త్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లలో ఇన్స్‌పెక్టర్‌గా పనిచేసివున్నారు కూడా.

# త్యాగరాజస్వామికి..రాగనీరాజనం

బహుళపంచమి పుణ్యతిథిని పురస్కరించుకుని ఇటీవల నెల్లూరులోని ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ప్రభుత్వ సంగీత నృత్యపాఠశాలలో వీనులవిందుగా గాత్రకచేరీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు త్యాగరాజ స్వామి కీర్తనలను అద్భుతంగా గానం చేశారు. అనంతరం విద్యార్థులను అందరూ అభినందించారు. గాయకులు శ్రీవత్సల, కమల, సత్యవతితో పాటు, ప్రిన్సిపాల్ సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

# వాత్సల్య చిన్నారులకు వితరణ



భారతీయ మజ్దూర్ సంఘ్ (బిఎంఎస్) వ్యవస్థాపకుడు దత్తోపంత్ 19వ వర్ధంతిని పురస్కరించుకుని ఇటీవల నెల్లూరులోని వాత్సల్య అనాథ బాలల శరణాలయంలోని చిన్నారులు, వృద్ధులు 110 మందికి లక్షా 50వేల రూపాయల విలువచేసే వస్త్రాలతో పాటు ఫ్యాన్లు, నిత్యావసర సామగ్రిని వితరణగా అందజేశారు. బిఎంఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఖాదర్‌బాషా, ఆర్టీసి నెల్లూరు రీజియన్ మేనేజర్ శేషయ్య, నారాయణ మెడికల్ కాలేజీ డాక్టర్ కమల్‌కుమార్, సుబ్రహ్మణ్యం, వాత్సల్య ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివరావు, ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

## నెల్లూరు కబుర్లు

# స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టాలి

### - కలెక్టర్ చక్రధర్‌బాబు

గర్భస్థ లింగ నిర్ధారణ నేరమని, ఎక్కడైనా స్కానింగ్ సెంటర్ల వారు పరీక్షలు చేసి, పుట్టబోయే బిడ్డ ఆడ లేక మగ అని నిర్ధారిస్తే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఇటీవల ఆయన వైద్యశాఖ, ఇతర శాఖల అధికారులతో సమావేశమయ్యారు. స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టాలని, రికార్డులను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తుండాలని అధికారులకు సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య, దిశ పోలీస్‌స్టేషన్ సిఐ రామారావు, పెద్దాసుపత్రి గైనకాలజిస్ట్ హెచ్ఓడి డాక్టర్ గీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## సాయిదర్బార్‌లో...
# కన్నులపండువగా.. చావడి ఉత్సవం



నెల్లూరు బాలాజీ నగర్, శివారులో ఉన్న పద్మావతినగర్‌లో కొలువైవున్న సాయి దర్బార్ అద్దాలమందిరంలో ఇటీవల సాయినాథునికి విశిష్టమైన చావడి ఉత్సవాలను కన్నులపండువగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో సాయిభక్తులు పాల్గొని పూజలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు బాబా చిత్రపటాన్ని, సాయి పాదుకలను పల్లకిలో ఊరేగించారు. మందిరంలోని శ్రీ సాయిమాత నిత్యాన్నప్రసాదాలయంలో మండలదీక్షలో పాల్గొన్న భక్తులు దీక్ష పూర్తయి, షిరిడీయాత్రలో పాల్గొంటున్న సందర్భంగా ఈ ఉత్సవాలను షిరిడీలో వలె సంప్రదాయబద్ధంగా, వైభవంగా నిర్వహించారు. సాయిదర్బార్ అద్దాల మందిరం నిర్వాహకులు మధుసాయి తదితరులు పర్యవేక్షించారు.

# సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ కార్యక్రమంలో డా.బిందుమీనన్



విక్రమ సింహపురి విశ్వ విద్యాలయంలో ఇటీవల సెంటర్‌ఫర్ ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్ మరియు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ నిర్వహించిన పరిశోధన కార్యక్రమంలో నెల్లూరులోని అపోలో ఆసుపత్రి వైద్యురాలు, డాక్టర్ బిందుమీనన్ పాల్గొని, న్యూరాలజీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాముఖ్యతపై ఉపన్యసించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.ఎం సుందరవల్లి మాట్లాడుతూ ఇన్నోవేషన్ మరియు ఇంక్యుబేషన్ ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు మరియు అధ్యాపకులు మంచి పరిశోధనలను అలవర్చుకోవాలని సూచించారు. రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, ప్రొఫెసర్ జి.విజయానంద్ కుమార్‌బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ యస్.బి.సాయినాథ్, డాక్టర్ పి.త్రివేణి, డాక్టర్ కెవిఎల్ శ్రీకన్యరావు, డాక్టర్ ఎం.హనుమరెడ్డి, డాక్టర్ ఎం.హుస్సేనయ్య, డాక్టర్ అల్లం ఉదయ్ శంకర్, డాక్టర్ విద్యా ప్రభాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మూడోతరగతి బుడతడు
# స్కేటింగ్‌లో అదరగొట్టాడు



రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు నెల్లూరులోని డా. కిషోర్స్ రత్నం స్కూల్‌లో 3వ తరగతి చదువుతున్న విద్యార్థి ఎస్.సాయి మన్విత్ ఎంపికై అందరి ప్రశంసలందుకున్నాడు. ఈ సందర్భంగా మన్విత్‌ను విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు అభినందించారు. రోలర్‌స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీల్లో మన్విత్ స్వర్ణపతకం సాధించడం పట్ల విద్యాసంస్థల డైరెక్టర్లు డా. కృష్ణకిషోర్, వాసంతి కిషోర్‌లు కూడా సంతోషం వ్యక్తం చేశారని, నవంబరు 27 నుండి 31వతేదీ వరకు విశాఖలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్న మన్విత్, అక్కడ కూడా విజేతగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాల్ జాస్మిన్ తదితరులు పాల్గొన్నారు.

# 27న..సిఎం జగన్ పర్యటన



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన ఖరారైంది. అక్టోబరు 27న జిల్లాలోని ముత్తుకూరు మండలం నేలటూరులోని ఏపి జెన్‌కో ప్రాజెక్టు 3వ యూనిట్‌ను సిఎం ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. ఈనెల 18న రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ముత్తుకూరులో సిఎం పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ చక్రధర్‌బాబు, ఎస్పీ విజయారావు, జెన్‌కో డైరెక్టర్ చంద్రశేఖరరాజుతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎప్పటినుంచో పెండింగ్‌లో ఉన్న మత్స్యకారేతర ప్యాకేజీని కూడా సిఎం ప్రారంభిస్తారని మంత్రి కాకాణి తెలిపారు. నేలటూరు తీరప్రాంతంలో నిర్మించనున్న మినీ ఫిషింగ్ హార్బర్‌కు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసే అవకాశం ఉందన్నారు.

# రాష్ట్ర సరిహద్దులకు..రాహుల్ యాత్ర

### - డిసిసి నేత చేవూరు



ఇటీవల కర్నాటకలోని రాయదుర్గం, బళ్ళారి సమీపంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సరిహద్దుకు చేరుకున్న రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రకు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, నెల్లూరు-ప్రకాశం జిల్లాలకు సంబంధించిన పలువురు ముఖ్య నాయకులు ఘనస్వాగతం పలికారు. నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొని రాహుల్‌ను స్వాగతించారు. పీసీసీ అధ్యక్షులు సాకే. శైలజానాథ్, మాజీ రాజ్యసభ సభ్యులు కేవీపీ రామచంద్రరావు, మాజీ పీసీసీ అధ్యక్షులు రఘువీరారెడ్డి, ఏఐసీసీ కార్యదర్శులు కొప్పుల రాజు, జేడీ.శీలం, రుద్రరాజు, కనుమూరి బాపిరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్స్ నర్రెడ్డి. తులసీరెడ్డి, షేక్.మస్తాన్ వలీ, రాష్ట్ర అధికార ప్రతినిధి తేళ్లపల్లి సురేష్‌బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేవూరు శ్రీధర్‌రెడ్డి, ప్రకాశం జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, నెల్లూరుజిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు కొండా అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గుడ్డు..ఆరోగ్యానికి వెరీగుడ్డు

### - ఫ్రెండ్స్ వాకర్స్ ఆధ్వర్యంలో కోడిగుడ్ల పంపిణీ



అంతర్జాతీయ గుడ్డు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ వారు రోజువారీ ఆహారంలో కోడిగుడ్డు ప్రాధాన్యతను క్రీడాకారులకు, వాకర్స్‌కు వివరించారు. అన్నిరకాల పోషక విలువలు కలిగి, ఆరోగ్యరక్షణకు ఎంతో ఉపయోగపడుతూ, అతితక్కువ ధరకు లభించే కోడిగుడ్డును ఆహారంగా స్వీకరించడం మంచిదని వారు అవగాహన కలిగించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కొండూరు సుబ్బారావు ఆధ్వర్యంలో స్థానిక ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎన్ఇసిసి జోనల్ మాజీ ఛైర్మెన్ నలుబోలు బలరామయ్యనాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని ఆరోగ్యానికి గుడ్డు.. వెరీగుడ్డు అని తెలిపారు. కోడిగుడ్డు పూర్తిగా శాకాహారమని, పోషకాహార లోపాన్ని నివారించడంలోను, శరీరంలోని కొవ్వుశాతాన్ని నియంత్రించడంలోనూ కోడిగుడ్డు బాగా పనిచేస్తుందన్నారు. ఆ తర్వాత ఉడికించిన కోడిగుడ్లను నెక్ సలహాదారుడు బాలస్వామి, హైటెక్ రమణారెడ్డిల సహకారంతో అందరికీ అందజేశారు. వాత్సల్య నిరాధార బాలల ఆశ్రమంలోని చిన్నారులకు 800 కోడిగుడ్లను పంపిణీ చేశారు. అసోసియేషన్ కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి ఆర్ సుబ్బారావు, వాకర్స్ మాజీ గవర్నర్లు ఏకొల్లు రాఘవరెడ్డి, రాఘవేంద్రషెట్టితో పాటు వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

# ‘గూగుల్’ కన్నా..గురువే మిన్న!

## మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



నేటి ఆధునిక కాలంలో ‘గూగుల్’ వచ్చినా గురువుకు సాటిలేదని, గూగుల్ కన్నా గురువే మిన్న అని భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో తమ గురువైన ప్రముఖ సారస్వతవేత్త పోలూరి హనుమజ్జానకీ రామశర్మ స్మారకంగా నెలకొల్పిన సాహితీ పురస్కార కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గూగుల్ సమాచారం మాత్రమే అందిస్తుందని, గురువు విజ్ఞానంతో పాటు ఆ విజ్ఞానాన్ని ఎలా వినియోగించుకోవాలో వివేకాన్ని కూడా ప్రసాదిస్తారని, అందుకే గురువుల విశిష్టత ఏనాటికీ చెరగనిదని అన్నారు. ఈ సందర్భంగా దూరదర్శన్ విశ్రాంత అడిషనల్ డైరెక్టర్ జనరల్, ప్రసిద్ధ సాహితీవేత్త రేవూరి అనంతపద్మనాభరావుకు ‘పోలూరి హనుమజ్జానకీరామశర్మ పురస్కారం’ అందజేసి ఆయన ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ భాష ఆగిపోతే శ్వాస ఆగిపోయినట్లేనని, మాతృభాష పరిరక్షణకు అందరూ కంకణం కట్టుకోవాలని ఉద్బోధించారు. భాషను కాపాడుకుంటేనే సాహిత్యం ద్వారా విశిష్టమైన మన సంస్కృతిని భావితరాల వారికి అందించవచ్చన్నారు. జీవితంలో తనకు లభించిన ఉన్నతమైన గురువుగా పోలూరి వారు తన మనసులో పదిలంగా నిలచిపోయారని, వారు సాక్షాత్తూ సరస్వతీ స్వరూపమని, వారి గొప్పతనం భావితరాల వారికి తెలియజేయాలనే సంకల్పంతోనే తన గురువు పేరిట ఈ అవార్డును ఏర్పాటు చేశామని వెంకయ్యనాయుడు ఎంతో వినమ్రంగా తెలిపారు. నేటికీ సాహిత్యసీమలో పరిశోధనలు సాగిస్తున్న రేవూరి అనంత పద్మనాభరావు కూడా పోలూరి వారి ప్రియశిష్యుల్లో ఒకరని అంటూ, అలాంటి విశిష్ట వ్యక్తికి మరో శిష్యుడు అవార్డు అందించడం ద్వారా జానకీరామశర్మ ఆత్మ సంతృప్తి చెందుతుందని ఆయన అన్నారు. అనంతరం రేవూరి అనంతపద్మనాభరావు రచించిన ‘ఆచార్య దేవో భవ’ పుస్తకాన్ని వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అవార్డుతో పాటు తనకు బహుకరించిన పాతికవేల రూపాయలను రేవూరి వారు తన గురువర్యులైన పోలూరి వారి అముద్రిత గ్రంథం ‘శ్రీనాథుడు’ను వెలుగులోకి తెచ్చేందుకు తనవంతు గురుదక్షిణగా సమర్పించుకోవడం ఆయన గురుభక్తికి నిదర్శనంగా నిలిచింది. ఈ కార్యక్రమానికి ప్రసిద్ధ సాహితీవేత్త ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షత వహించారు. శాంతా బయోటెక్నిక్స్ అధినేత, ప్రముఖ సారస్వతవేత్త డా.కెఐ వరప్రసాదరెడ్డి, పరిషత్ ప్రధాన కార్యదర్శి డా.జె.చెన్నయ్య, డా. ముదిగంటి సుజాతారెడ్డి పాల్గొన్నారు.



### అనారోగ్య బాధితులకు..

# ప్రసన్న లక్ష రూపాయల సాయం

అనారోగ్యంతో బాధపడుతూ, చికిత్సల కోసం ఆర్థికస్థితి బాగా లేక అవస్తలు పడుతున్న ఇరువురికి కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆర్థికసాయం అందించి తమ ఔదార్యం చాటుకున్నారు. ‘గడప గడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమంలో భాగంగా ఆయన కొడవలూరు మండలం, తలమంచి దళితవాడలో పర్యటిస్తుండగా, తన కూతురు చందవరం అభినయ కొంతకాలంగా బ్యాక్‌బోన్ అనారోగ్యానికి గురై వ్యాధితో బాధపడుతోందని, ఆపరేషన్‌కు 50,000 ఖర్చవుతుందని, తమకు అంత స్తోమతు లేదని తెలియజేయగా, ప్రసన్న వెంటనే స్పందించి తమ తండ్రి స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్‌ట్రస్ట్ ద్వారా అభినయ ఆపరేషన్ కోసం 50వేల రూపాయలను ఆమె కుటుంబ సభ్యులకు సాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అభినయ తల్లిదండ్రులతో పాటు తలమంచి ఉప సర్పంచ్ ఆత్మకూరు వెంకటసతీష్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కోవూరు మండలం, వేగూరు గ్రామ శివాలయం అర్చకులు రొంపిచేర్ల వెంకటరమణయ్య గుండె ఆపరేషన్ కోసం వారి కుటుంబసభ్యులకు మరో 50 వేల రూపాయలు అందజేసి వారికి ఎమ్మెల్యే ప్రసన్న తమవంతు చేయూతనందించారు.

### డిసిసి నేత చేవూరుకు..

# బాలసుధాకర్ కృతజ్ఞతలు



తనను ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పిసిసి) సభ్యునిగా నియమించిన పార్టీ రాష్ట్ర కమిటీకి, అందుకు కృషిచేసిన డిసిసి అధినేత చేవూరు దేవకుమార్‌రెడ్డికి టి.బాలసుధాకర్ ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 18న నెల్లూరులోని ఇందిరాభవన్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్‌పార్టీలో చాలా చిన్న స్థాయి కార్యకర్త నుంచి ఇప్పటిదాకా అనేక బాధ్యతలు నిర్వహించానని, ప్రతి సందర్భంలో తనపై నాయకులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ కోసం కష్టించి పనిచేస్తున్నానని చెప్పారు. పార్టీ జిల్లా కమిటీ ఎస్సీ సెల్ ఛైర్మెన్‌గా, డిసిసి ఉపాధ్యక్షునిగా, ప్రత్యేక ఆహ్వానితునిగా వివిధ విభాగాల్లో పార్టీ కోసం పనిచేశానని, ఇప్పుడు పిసిసి సభ్యునిగా కూడా నియమించడం తనకెంతో సంతోషంగా ఉందని అన్నారు. పార్టీ కార్యకర్తగా పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషిచేస్తానని ఆయన తెలిపారు.

# 7న.. కార్తీక మహా దీపోత్సవం

## స్వర్ణాలఘాట్‌లో ‘గంగా హారతి’ - ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



కార్తీకపున్నమిని పురస్కరించుకుని నవంబరు 7న నెల్లూరు చెరువుగట్టునున్న స్వర్ణాలఘాట్ వద్ద అత్యంత వైభవంగా కార్తీక మహా దీపోత్సవం నిర్వహిస్తామని, భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఈ దీపోత్సవంలో పాల్గొనాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి విజ్ఞప్తిచేశారు. ఈనెల18న నగరంలోని వైకాపా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కార్తీక పున్నమి రోజున పెద్దఎత్తున పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఘాట్‌లో శివలింగాన్ని ఏర్పాటుచేస్తారని, ఆరోజున ఉదయం నుంచి భక్తులు తమ గోత్రనామాలతో స్వామివారికి అభిషేకాలు, అష్టోత్తర పూజలు చేసుకునే అవకాశం కల్పించామన్నారు. 11 గంటల నుంచి 28 మంది రుత్విక్కులతో హోమాలు జరుగుతాయని, సాయంత్రం 4 గంటలకు 1008 మంది మహిళలతో కార్తీ దీపోత్సవం శోభాయాత్ర నేత్రపర్వంగా నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 6 గంటలకు హరిద్వార్, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల నుంచి వచ్చే అర్చకస్వాములతో ‘గంగాహారతి’ కార్యక్రమాన్ని మరింత గొప్పగా చేస్తామని, పలుప్రాంతాల నుండి తీసుకువచ్చిన పవిత్ర జలాలతో డ్రోన్‌ల సాయంతో దీపోత్సవంలో పాల్గొన్న భక్తులకు సంప్రోక్షణ చేస్తారన్నారు. కార్తీక దీపోత్సవాన్ని వేడుకగా నిర్వహించాలనే సంకల్పంతో సింహపురి కార్తీకదీపోత్సవ సమితికి తోడ్పాటు అందిస్తున్నామన్నారు.

# వైకాపా అభ్యర్థులకు ఘనవిజయం చేకూర్చండి

## - మాజీమంత్రి, ఎమ్మెల్యే ఆనం



తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైకాపా అభ్యర్థులుగా రంగంలో ఉన్నవారికి ఘన విజయం చేకూర్చాలని మాజీమంత్రి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఈనెల 17న ఆయన నెల్లూరులోని తమ నివాసంలో, పట్టభద్రుల అభ్యర్థిగా పోటీచేస్తున్న పేర్నేటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి గెలుపుకోసం వెంకటగిరి నియోజకవర్గానికి చెందిన ముఖ్యులతో సమావేశం నిర్వహించారు. గత ఎన్నికల్లో 5937 మంది పట్టభద్రులు వెంకటగిరి నియోజకవర్గ పరిధిలో ఓటర్లుగా నమోదై వున్నారని, ప్రస్తుతం 2019 నాటికి పట్టభద్రులైన వారిని ఓటర్లుగా నమోదు పరిచేలా స్థానిక నాయకులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైకాపా అభ్యర్థుల ఘన విజయానికి అందరూ కృషి చేయాలంటూ ఆయన వెంకటగిరి రూరల్, డక్కిలి, బాలాయపల్లి, సైదాపురం, రాపూరు, కలువాయి మండల నేతలకు దిశా నిర్దేశం చేశారు.

### బిజెపి జిల్లా అధ్యక్షునిగా..

# మళ్ళీ గుండ్లపల్లి



బిజెపి జిల్లా అధ్యక్షునిగా మళ్ళీ గుండ్లపల్లి భరత్‌కుమార్‌యాదవ్ నియమితులయ్యారు. బిజెపి అధిష్టానం 2019లో ఆయన్ను జిల్లా అధ్యక్షునిగా నియమించిన విషయం తెలిసిందే. తాజాగా రెండవ సారి అదేస్థానంలో నియమితులు కావడంతో ఈనెల 17న నెల్లూరులోని బిజెపి కార్యాలయంలో నాయకులు ఆయన్ను అభినందించి శుభాకాంక్షలు చెప్పారు. బిజెపి నాయకులు గిరికుమార్‌గౌడ్, నారాయణరెడ్డి, రాజేశ్వరమ్మ, ప్రసన్న, శ్రీనివాసులుగౌడ్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

# భారీ కుంభకోణంపై.. సమగ్ర విచారణ జరగాలి

## -వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మెన్‌కు రైతు సంఘం నేత లేఖ

నెల్లూరులోని జిల్లా పౌరసరఫరాల సంస్థలో జరిగిన భారీ కుంభకోణంపై అన్ని కోణాల్లో లోతుగా విచారణ జరిపించాలని, ముఖ్యంగా ఆ సంస్థలోని ఆర్థిక లావాదేవీలపై సమగ్ర విచారణ చేయాలని రాష్ట్ర రైతుసంఘాల సమాఖ్య అధ్యక్షులు చిరసాని కోటిరెడ్డి రాష్ట్ర వ్యవసాయమిషన్ వైస్‌ఛైర్మెన్ నాగిరెడ్డికి ఈనెల 17న లేఖ రాశారు. ఒక చిరుద్యోగి కోట్లాది రూపాయల నిధులు మళ్ళించడం విస్మయం కలిగిస్తోందని, కోట్లాది రూపాయల కుంభకోణం జరుగుతున్నా జిల్లాస్థాయి, జోనల్ స్థాయి అధికారులు ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఒక్క నెల్లూరులోనే కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా అన్నిజిల్లాల్లో ఇలాంటి కుంభకోణాలేమైనా జరుగుతున్నాయేమో విచారణ చేయించాలన్నారు. పౌరసరఫరాల సంస్థ జిల్లా రైతాంగానికి చెల్లించాల్సిన బకాయిలు, రవాణా ఛార్జీలు, హమాలీల కూలీలను వెంటనే చెల్లించేలా ఏర్పాటుచేయాలని ఆయన కోరారు.






# తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

## పి.ఆర్ ఇంజనీర్లపై కక్ష సాధింపు తగదు

**రియాజ్ అహ్మద్**



రాష్ట్ర ప్రభుత్వం పంచాయితీరాజ్ ఇంజనీర్లపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని ఆ సంఘ నాయకుడు షేక్ రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. పంచాయితీరాజ్ శాఖ కార్యాలయం వద్ద ఈ నెల 17న నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపట్టిన గ్రామ సచివాలయాలు, వెల్నెస్ కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీ భవన నిర్మాణ బిల్లులను ప్రభుత్వం సక్రమంగా చెల్లించడం లేదని, పనులకు పిఆర్ ఇంజనీర్లను బాధ్యులుగా చేస్తూ సస్పెండ్ చేయడం దారుణమన్నారు. కలెక్టర్ కాన్ఫరెన్స్‌ల పేరిట ఉద్యోగులను అసభ్య పదజాలంతో దూషించడం సరికాదన్నారు. సంఘ నాయకులు శ్రీనివాసులురెడ్డి దయాకర్, రవీంద్రకుమార్, కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు సి.ఆర్.రెడ్డి 'ఆసరా'



గూడూరు పట్టణంలోని డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో డాక్టర్ సి.ఆర్.రెడ్డి ఆసరా పథకంలో భాగంగా సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 16న డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి చేతుల మీదుగా పేదలకు, వృద్ధులకు ఫలసరుకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు సహాయం చేయడం చాలా సంతోషంగా ఉందని, ప్రతిఒక్కరూ సేవాదృక్పథంతో మెల గాలని సూచించారు. ప్రతినిధులు మధుసూదన్‌రెడ్డి, సిద్ధారెడ్డి, ధనుంజయ్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## బాల్య వివాహాలు చట్టవ్యతిరేకం

బాల్య వివాహాలు చేసి చిన్నారుల జీవితాన్ని ఇబ్బందులు పాలు చేయకూడదని, వాటిని అరికట్టాలని 7వ అదనపు జిల్లా జడ్జి షమ్మి పర్వీన్‌సుల్తానా బేగం తెలిపారు. జానకిరామ్‌పేట గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 16న అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలియజేశారు. న్యాయమూర్తులు అశోక్‌కుమార్, లోకనాథం, న్యాయవాదులు హరినాథ్, ప్రసాదరావు, అరవ పార్వతయ్య, ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు జెవివి దుప్పట్లు



తిరుపతి జిల్లా గూడూరు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రవ్వా సుబ్రహ్మణ్యం దాతృత్వంతో ఓం సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఇటీవల దుప్పట్లు పంపిణీ చేశారు. జె.వి.వి ఉపాధ్యక్షులు చెంచునారాయణ మాట్లాడుతూ రానున్న చలికాలంలో వృద్ధులకు దుప్పట్లు అవసరం అని భావించి నేరెళ్ళ వెంకట సురేష్ ద్వారా రవ్వా సుబ్రహ్మణ్యం తల్లి రవ్వా వెంకట కృష్ణ కుమారి జ్ఞాపకార్థం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేయడం ఆనందంగా ఉందని, వృద్ధుల కోసం జె.వి.వి చాలా కార్యక్రమాలు చేసిందని, వారికి అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు. రవ్వా సుబ్రహ్మణ్యం, వెంకటలాస్య, స్వాప్నిక, నేరెళ్ళ సురేష్, జె.వి.వి అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, రామ మోహన్, పురుషోత్తమరావు, గుర్రం విజయ్‌బాబు, కటకం శ్రీను, రమేష్, ఆశ్రమ నిర్వాహకురాలు కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.



ఈ నెల 17న గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు ఆధ్వర్యంలో తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జరిగిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ అభ్యర్థులు పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డి, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, మేరిగ మురళి తదితరులు

## ఎన్‌బికెఆర్ అధ్యాపకునికి అవార్డు



కోట మండలం విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ విభాగ ఆచార్యుడు, సొసైటీ ఆఫ్ ఆటోమోటివ్ ఇంజనీర్స్ (ఎస్ఏఇ) సదరన్ సెక్షన్ అమరావతి విభాగం కార్యదర్శి డాక్టర్ వై.అశోక్ కుమార్‌రెడ్డి ఇటీవల ప్రతిష్టాత్మకమైన లీడర్‌షిప్ అవార్డును అందుకున్నారు. చెన్నైలోని ఓ హోటల్‌లో ఈనెల 16న నిర్వహించిన ఎస్ఏఇ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయనకు ఈ పురస్కారాన్ని అందజేశారు. ఎస్ఏఇ ఇండియా దక్షిణ భారతదేశ విభాగం పనితీరులో నాయకత్వ పాత్ర పోషించినందుకు ఆయనకు ఈ అవార్డును ప్రకటించారు. ప్రొఫెషనల్ మెంబర్ విభాగంలో సిహెచ్ రామకృష్ణయ్య, విద్యార్థి విభాగంలో కె.భానుచందు బెస్ట్ వాలంటీర్ అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అశోక్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, ఎన్‌బికెఆర్ మెకానికల్ విభాగంలో ఎస్ఏఇ కాలేజియేట్ క్లబ్ స్థాపించి, దాదాపు ఆరేళ్లుగా విద్యార్థులను ప్రోత్సహిస్తూ జాతీయస్థాయిలో వివిధ పోటీలలో పలు వాహనాలను రూపొందించి బహుమతులు కైవశం చేసుకునేలా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ఈ క్లబ్ ద్వారా విద్యార్థులకు కంపెనీల ప్రతినిధులతో ఆటోమోటివ్ ఇండస్ట్రీలోని అత్యాధునిక టెక్నాలజీల పై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా అవార్డులు పొందిన వారిని కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్ రెడ్డి, పలువురు అధ్యాపకులు అభినందించారు.

## ఉత్సాహంగా సైకిల్ ర్యాలీ



ఎన్‌బికెఆర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఇటీవల ఎన్‌సిసి, నావెల్ క్యాడెట్లు ఉత్సాహంగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఇసిఇ హెచ్ఓడి డా.జి.హరినాథ్‌రెడ్డి, డా.సి.రవీంద్రరెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. 30 మంది విద్యార్థులు పాల్గొని 30 కిలోమీటర్ల సైకిల్ ర్యాలీ చేపట్టారు. నావెల్ అధికారి డా.వి.మల్లికార్జునరెడ్డి, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ సభ్యుడు, అధ్యాపకుడు డా.జి. చెన్నారెడ్డి మార్గదర్శకత్వంలో ర్యాలీ జరిగింది. కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు. కె.శోభారాణి, పి.పవన్‌కుమార్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఛత్రపతి శివాజీ చరిత్రను కళ్ళకుకట్టే.. 'శివభారతం'

**- ప్రముఖ అవధాని నరాల రామారెడ్డి**



ఛత్రపతి శివాజీ చరిత్ర అద్భుతమైనదని, మహాకవి గడియారం వేంకటశేష శాస్త్రి రచించిన 'శివభారతము'లో శివాజీ గొప్పతనాన్ని కళ్ళకు కట్టినట్లుగా రచించారని ప్రముఖ అవధాని, సువర్ణ గండపెండేర సత్కార గ్రహీత నరాల రామారెడ్డి (ప్రొద్దుటూరు) అన్నారు. ఈనెల 16న నెల్లూరు టౌన్‌హాలు ప్రాంగణంలోని ఏసి హాల్‌లో 'శివభారతము' గ్రంథంపై జరిగిన సాహిత్యోపన్యాసంలో ఆయన పాల్గొని, దేశభక్తికి ప్రతీకగా.. వీరత్వానికి మారుపేరుగా నిలిచిన ఛత్రపతి శివాజీ విశిష్టతపై తనదైన శైలిలో అత్యద్భుతంగా ప్రసంగించి అందరి ప్రశంసలందుకున్నారు. యుద్ధతంత్రంలో శివాజీ వ్యూహ నిపుణతను, ఆయనకున్న స్వాభిమానాన్ని, హిందూ సామ్రాజ్య సాధనా పటిమను, భారతదేశ సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణాభిలాషను, పరమత సహనాన్ని వివరంగా తెలియజేసి సభను రంజింపజేశారు. శివాజీ తల్లి జిజియాబాయి ఔన్నత్యాన్ని, గురువు సమర్థ రామదాసు మహిమను, శివభారతంలోని హృద్యమైన పద్యాలన్నిటినీ రసస్ఫోరకంగా వర్ణించారు. అనంతరం అవధాని రామారెడ్డిని సభా నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. పద్యకళాపరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. సురేంద్రరెడ్డి అధ్యక్షత వహించారు. ప్రముఖ సాహితీవేత్త కరిమద్దెల నరసింహారెడ్డి సభను నిర్వహించారు.


### అలరించిన కవిసమ్మేళనం

తొలుత ఈ సందర్భంగా ప్రముఖ సాహితీవేత్త డా. ఛీమకుర్తి వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో దేశభక్తి, మాతృభాష తదితర అంశాలపై జరిగిన కవిసమ్మేళనం అందరినీ అలరించింది. ప్రముఖ కవులు కోట శ్రీరామమూర్తి, ఊరుబిండి వేంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, అవధాని కోట రాజశేఖర్, అగస్త్యరాజు సుబ్బారావు, సాధు గోపాలకృష్ణ (ప్రొద్దుటూరు), బృందావనరావు, మాటేటి రత్నప్రసాద్, నూకలపాటి మధుసూదనరెడ్డి, పేరిసెట్ల శివకుమార్, అంకబాబు, రఘు తదితరులతో పాటు ప్రముఖ కవయిత్రులు పాతూరి అన్నపూర్ణ, బొగ్గరపు ఇందిరా కృష్ణ, వాయుగండ్ల శశికళ, నగ్మా తదితరులు పాల్గొన్నారు.

### సివిల్‌సప్లయిస్ కుంభకోణంపై..

## సిఐడి విచారణ జరిపించాలి

**బిజెపి నాయకుడు మిడతల రమేష్**



నెల్లూరులోని పౌరసరఫరాల సంస్థ (సివిల్ సప్లయిస్ కార్పొరేషన్)లో జరిగిన భారీ కుంభకోణంపై సిఐడిచే విచారణ జరిపించాలని నమామి గంగే రాష్ట్ర ప్రముఖ్, బిజెపి నాయకుడు మిడతల రమేష్ డిమాండ్ చేశారు. ఈనెల 18న ఆయన ఆమేరకు డిఆర్ఓ వెంకటనారాయణమ్మకు వినతిపత్రం సమర్పించారు. ఈ భారీ కుంభకోణంలో క్రిందిస్థాయి సిబ్బందిని ఇరికించి ఉన్నతాధికారులు తప్పించుకోవాలని చూస్తున్నారని, వీటన్నిటిపై సమగ్రంగా విచారణ జరిపించాలని ఆయన కోరారు.

## సాఫ్ట్‌బాల్ యశ్వంత్‌కు సన్మానం

గుజరాత్‌లో ఇటీవల జరిగిన 36వ జాతీయ క్రీడల్లో సాఫ్ట్‌బాల్ పురుషుల జట్టులో రాణించిన నెల్లూరుకు చెందిన క్రీడాకారుడు యశ్వంత్‌ను స్థానిక శాంతినగర్‌లోని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యాలయంలో సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షుడు మలిరెడ్డి కోటారెడ్డి, కార్యదర్శి కామేశ్వరి, కోచ్ శుక్రుత యశ్వంత్‌ను అభినందించారు.

# కుంభకోణాల కేంద్రంగా.. నెల్లూరు

## సివిల్ సప్లయిస్‌లో కోట్లు స్వాహాపై.. మండిపడ్డ సోమిరెడ్డి



నెల్లూరు పౌర సరఫరాల సంస్థలో జరిగిన భారీ కుంభకోణంపై మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మండిపడ్డారు. కుంభకోణాలకు కేంద్రంగా నెల్లూరుజిల్లా మారిపో యిందన్నారు. నెల్లూరు పౌరసరఫరాల సంస్థలో రెండున్నరేళ్లలో రూ. 29.78 కోట్లు కుంభకోణం జరిగిందని ఉన్నతాధికారులే తేల్చారని, ఇప్పటికి బయటపడింది ఈ రూ.29.78 కోట్లేనని, లోతుగా విచారిస్తే ఇంకా ఎన్ని కోట్లు వెలుగులోకి వస్తాయోనని ఆయన అన్నారు. నెల్లూరులో తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డితో కలిసి ఆయన ఇటీవల విలేకర్లతో మాట్లాడారు. ప్రతి నెలా కోట్లకు కోట్లు దోపిడీ చేస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. ఈ భారీ కుంభకోణంలో చిన్నచిన్నోళ్లను 11 మందిని సస్పెండ్ చేసి, కేసులు పెట్టి చేతులు దులుపుకోవడం వల్ల ప్రయోజనం ఉండదన్నారు. దీనివెనుకనున్న పెద్దల పాత్రను కూడా విచారించాలన్నారు. రెండున్నరేళ్లలో ఆ శాఖను పర్యవేక్షించే నలుగురు జేసీలను మార్చేయడం కూడా కుంభకోణంలో భాగమేనన్నారు. రైతు భరోసా కేంద్రాలను రైతు భక్షక కేంద్రాలుగా మార్చి అన్నదాతలను నిలువు దోపిడీ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 'రైతుల కోసమే బతుకుతున్నాం...ప్రతి గింజా కొంటాం'.. అని జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తుత్తి సమీక్షలు చేయడం కాదు..ముందు ఈ కుంభకోణాల గురించి తేల్చాలన్నారు. రెండున్నరేళ్లుగా మిల్లింగ్ చార్జీలు రూ. 240 కోట్లు, ఈ క్రాప్‌బుకింగ్‌లో ఫ్రాడ్ జరిగిందని రైతులకు రూ. 100 కోట్లు చెల్లించకుండా ఆపేశారని, పొదుపు సంఘాలకు ఇవ్వాల్సిన కమీషన్ రూ. 5 కోట్లు, హమాలీలకు ఇవ్వాల్సిన రూ. 10 కోట్లు చెల్లించలేదని, ఇదెక్కడి అన్యాయమని అన్నారు. అసలు ఇది ప్రభుత్వమేనా?..అని ప్రశ్నించారు. ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతులకు ఆర్నెల్ల ఆలస్యంగా డబ్బులు ఇవ్వడానికి మీకు మనస్సెలా ఒప్పుతుందన్నారు. ధాన్యం కొనుగోలుచేసిన రోజే రవాణాచార్జీలు చెల్లించివుంటే ఇప్పుడు ఈ భారీ కుంభకోణానికి ఆస్కారం ఉండేదే కాదన్నారు. రేషన్ బియ్యం విషయం లోనూ జిల్లాలో భారీ కుంభకోణం జరుగుతోందని, లబ్ధిదారుల వద్ద కిలో రూ. 10కి బియ్యం కొనుగోలు చేసి కృష్ణపట్నం పోర్టు ద్వారా విదేశాలకు తరలించి వందల కోట్లు సంపాదిస్తున్నారని సోమిరెడ్డి ఈ సందర్భంగా ఆరోపించారు. రేషన్ బియ్యం కుంభకోణంపై కూడా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## కార్తీకమాసంలో శైవక్షేత్రాలకు..

# ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

కార్తీకమాసాన్ని పురస్కరించుకుని నెల్లూరు రీజియన్ నుంచి పలు పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతామని జిల్లా ప్రజా రవాణా అధికారి పివి శేషయ్య చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరులోని తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. కార్తీక సోమవారం నాడు భక్తులసౌకర్యార్థం 5 ప్రముఖ శైవక్షేత్రాలైన అమరావతిలోని అమరారామం, భీమవరంలోని సోమేశ్వరరామం, పాలకొల్లులోని క్షీరారామం, ద్రాక్షారామంలోని భీమేశ్వరరామం, సామర్లకోటలోని కొమరారామం క్షేత్రాలకు బస్సులు నడుపుతామన్నారు. ప్రతి ఆదివారం నెల్లూరు ప్రధాన బస్టాండ్ నుంచి ప్రత్యేకబస్సు బయలుదేరుతుందని, ఈనెల 30న, నవంబరు 6, 13, 20 తేదీల్లో రాత్రి 9 గంటలకు బస్సు బయలుదేరి, మంగళవారం ఉదయం 6 గంటలకు నెల్లూరుకు చేరుతుందని, ఈ ప్రత్యేక యాత్రా బస్సులో ఒక్కొక్కరికి 2500 రూపాయల వంతున ఛార్జీ ఉంటుందని తెలిపారు.

### అరుణాచలం క్షేత్రానికి

అదేవిధంగా అరుణాచల క్షేత్రాన్ని దర్శించుకునే భక్తులకు ప్రతి ఆదివారం ఆర్టీసి ప్రధాన బస్టాండ్ నుంచి అల్ట్రా డీలక్స్ బస్సు ఈనెల 30న, నవంబరు 6, 13, 20 తేదీల్లో ఉదయం 6 గంటలకు బయలుదేరి, తిరుత్తణి, శివకంచి, విష్ణుకంచి, తిరువణ్ణామలై (అరుణాచలం)తో పాటు కాణిపాకం క్షేత్రాన్ని కూడా భక్తులు దర్శించుకున్న అనంతరం మరుసటిరోజు సోమవారం రాత్రి 10 గంటలకు నెల్లూరుకు చేరుకుంటుందని, ఇందులో ప్రయాణీకులకు 1500 రూపాయల వంతున ఛార్జీ ఉంటుందని పేర్కొన్నారు. అంతేకాక, ప్రతినెలా పౌర్ణమి ముందురోజు నెల్లూరు నుంచి అరుణాచలంకు ప్రత్యేక బస్సు ఉంటుందని, ఉదయం 10 గంటలకు బస్సు బయలుదేరి శ్రీపురం, గోల్డెన్‌టెంపుల్‌కు వెళ్తుందని, అక్కడినుంచి అరుణాచలంకు చేరుకుంటుందని, గిరిప్రదక్షిణ అనంతరం తిరిగి బస్సు నెల్లూరుకు బయలుదేరి వస్తుందని చెప్పారు.

### శబరిమలైకి

శబరిమలైకి వెళ్లే యాత్రికుల సౌకర్యార్థం అయ్యప్పస్వాములకు ఆర్టీసీ నుంచి ప్రతిఏటా టూర్ ప్యాకేజీ, అద్దె ప్రాతిపదికన బస్సులు ఏర్పాటుచేశామని ఆయన తెలిపారు. నవంబరు 26, 28, 30 తేదీల్లోను, డిసెంబరు 2, 5, 8, 10, 15, 18, 25, 29 తేదీల్లోనూ, 2023 జనవరి 2,6, 11 తేదీల్లోనూ టూర్‌ప్యాకేజీ బస్సులు నడుస్తాయన్నారు. బస్సులు ఆ తేదీల్లో నెల్లూరులోని ప్రధాన బస్టాండ్ నుంచి బయలుదేరుతాయని, మొత్తం బస్సును లేదా విడివిడిగా టిక్కెట్లను బుక్ చేసుకోవచ్చన్నారు. సూపర్ లగ్జరీ, అల్ట్రాడీలక్స్, అల్ట్రా పల్లెవెలుగు బస్సులు భక్తులకు అందుబాటులో ఉంటాయన్నారు. పూర్తివివరాలకు ఆర్టీసీ విచారణ కేంద్రాల్లోని 9959225653, 73829 26439 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని ఆయన కోరారు.



# అబ్దుల్ కలాం సేవలు ఆదర్శప్రాయం

## విఎస్‌యులో జయంతి వేడుకలు

మాజీ రాష్ట్రపతి, 'భారతరత్న', 'మిస్సైల్ మాన్ ఆఫ్ ఇండియా' ఏపిజె అబ్దుల్ కలాం 91వ జయంతి వేడుకలు ఈనెల 15న ఘనంగా జరిగాయి. విఎస్‌యు ఉపకులపతి ఆచార్య జియం సుందరవల్లి ముఖ్యఅతిథిగా పాల్గొని కలాం విగ్రహానికి పూలదండ వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అబ్దుల్ కలాంకు విద్యార్థులంటే ఎంతో ఇష్టమని, వారితోనే ఎక్కువ సమయం గడిపేవారని, అందుకే ఆయన జన్మదినాన్ని ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవంగా జరుపుకుంటా రని తెలిపారు. రిజిస్ట్రార్ డా. పి.రామచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ ఆచార్య జి.విజయ్ ఆనందకుమార్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అనుమతి లేకుండా..

# టపాసుల అంగళ్ళు పెడితే చర్యలు

### అగ్నిమాపకశాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి



దీపావళి పండుగ నేపథ్యంలో టపాసుల అంగళ్లు పెట్టాలనుకుంటే అందుకు తప్పనిసరిగా అనుమతు లుండాలని, లైసెన్సులు పొంద కుండా విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి హెచ్చ రించారు. నెల్లూరులోని రైల్వేఫీడర్స్‌రోడ్‌లో ఉన్న అగ్నిమాపకశాఖ కార్యాలయంలో ఈనెల17న ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగళ్ల ఏర్పాటుకు సంబంధించి కలెక్టరేట్ నుంచి వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటా మని, నిబంధనల మేరకే అనుమతులుంటాయని చెప్పారు. జిల్లా కేంద్రమైన నెల్లూరుతో పాటు, ఆత్మకూరు-కావలి- కందుకూరుల్లో 20 గోడౌన్లకు అనుమతి ఉందని, వాటిలో టపాసుల నిల్వలను తనిఖీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. మూడురోజులపాటు జిల్లా వ్యాప్తంగా స్పెషల్‌డ్రైవ్‌లు నిర్వహిస్తా మన్నారు. గోడౌన్లలో కానీ, దుకాణాల్లో కానీ నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్సులు రద్దుచేయడమే కాకుండా క్రిమినల్ కేసులు కూడా నమోదు చేయడం జరుగుతుందన్నారు. నిషేధిత చైనా టపాసులు, నాటు టపాసులు అమ్మకూడదన్నారు. ఇప్పటిదాకా 59 లైసెన్సులు రెన్యువల్ చేశామని, 30 కొత్తవాటికి అనుమతిచ్చామని తెలిపారు. గోడౌన్ల నిర్వాహకులు తప్పనిసరిగా ఫైర్‌సేఫ్టీ పరికరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

### ప్రజలు జాగ్రత్తలు పాటించాలి :

దీపావళి సందర్భంగా టపాసుల కాల్చేటప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉంటూ, ఎలాంటి ప్రమాదాలకు లోనుకాకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని శ్రీకాంత్‌రెడ్డి ఈ సందర్భంగా చెప్పారు. నీళ్ళు, ఇసుక డ్రమ్ములు అందుబాటులో ఉంచుకోవా లన్నారు. ప్రజలకు ఆమేరకు అవగాహన కలిగించేందుకు పోస్టర్లను ముద్రించి పంపిణీచేస్తున్నామన్నారు. పొరపాటున ఏదైనా ప్రమాదం జరిగితే 101 నెంబర్‌కు ఫోన్‌చేస్తే వెంటనే తగు చర్యలు తీసుకుంటామన్నారు.

# కామాక్షితాయికి.. బంగారు సరుదు



జొన్నవాడ కామాక్షితాయి అమ్మవారికి నెల్లూరుకు చెందిన భక్తులు సిహెచ్ వెంకటసుబ్రహ్మణ్యం, కల్యాణిలు గంగా కామాక్షి అమ్మ వార్ల ఉత్సవమూర్తులకు నిత్యకల్యాణ కైంకర్యంలో అలంకరిం చేందుకు ఇటీవల 36.446 గ్రాముల బంగారు సరుదును సమ ర్పించుకున్నారు. ఆలయ నిర్వాహకులకు ఆ ఆభరణాన్ని అందజేసి అమ్మవారిని పూజించుకున్నారు.

## టూకీగా...



### ఐటిఐ విద్యార్థుల రక్తదానం

నెల్లూరు వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర ఐటిఐలో ఇటీవల రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థులు, సిబ్బంది పాల్గొని 86 యూనిట్ల రక్తదానం చేశారు. ఐటిఐ ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి, సిబ్బంది రహంతుల్లా, వంశీకృష్ణ, రాజేష్, రాజశేఖర్, రెడ్‌క్రాస్ మోటివేటర్లు భాస్కర్ రావు, మధు, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

### ఇద్దరు సిఐల బదిలీ

నెల్లూరులోని ఇద్దరు సిఐలను బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ డిఐజి డా.త్రివిక్రమవర్మ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. బాలాజీనగర్ ఇన్స్‌పెక్టర్ ఎం.మధుబాబును స్పెషల్ బ్రాంచ్‌లో నియమించారు. రేంజ్ కార్యాలయంలో ఉన్న రాములునాయక్‌ను బాలాజీనగర్ స్టేషన్‌లో నియమించారు.

### మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

విద్యార్థులు, యువత మత్తుపదార్థాలకు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని రాపూరు సెబ్ ఇన్‌ఛార్జి సిఐ శ్రీనివాసులు ఇటీవల పొదలకూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు తెలిపారు. మత్తుపదార్థాల వల్ల ఆరోగ్యం దెబ్బతినడమే కాక, జీవితాలు ఎలా నాశనమవుతాయో అవగాహన కలిగించారు. ప్రిన్సిపాల్ సిహెచ్ శ్రీనివాసులురెడ్డి, సెబ్ సిబ్బంది పాల్గొన్నారు

### సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు ప్రబల కుండా చూడాలని డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య తెలిపారు. ఇటీవల ఆయన కొత్తూరు పరిధిలోని కుమ్మరగుంట కాలనీలో వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్‌సెంటర్‌ను సంద ర్శించి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు సూచనలిచ్చారు.

### పెద్దఅన్నలూరులో వాటర్‌ప్లాంట్

కలిగిరి మండలంలోని పెద్దఅన్నలూరు గ్రామంలో మెట్టుకూరు పిచ్చిరెడ్డి జ్ఞాపకార్థం, జిల్లా కేంద్ర సహకారబ్యాంక్ మాజీ ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి సహకారంతో ఇటీవల ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుచేశారు. సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు అశోక్ దీనికి ప్రారంభోత్సవంచేశారు. ఎంసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ ప్లాంట్ నిర్మాణం జరిగింది.

### నిధుల స్వాహాపై డివైఎఫ్‌ఐ నిరసన

నెల్లూరులోని పౌరసరఫరా సంస్థలో జరిగిన భారీ కుంభ కోణంపై నెల్లూరు రూరల్ డివైఎఫ్‌ఐ కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల నిరసన నిర్వహించారు. రైతులకు, హమాలీలకు ఇవ్వాల్సిన సొమ్మును సంబంధిత శాఖలోని వారే తినేయడం ఘోరమని, దీనిపై విచారణ జరిపి బాధ్యులను శిక్షించాలని నాయకులు కోటేశ్వరరావు, శ్రీనివాసులు, చైతన్య, తరుణ్ కోరారు.

### బ్రాహ్మణ సేవాసంఘం వితరణ

నెల్లూరు రాయపుపాళెంలోని నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బ్రాహ్మణ సేవాసంఘం వారు ఇటీవల భోజనం ప్లేట్లు, గ్లాసులు, నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. సంఘం నిర్వాహకులు శనగవరపు సత్యనారాయణమూర్తి,ర మామిళ్ళపల్లి కాంతారావు, ఇసుకపల్లి కామేశ్వరప్రసాద్, చాకలికొండ సత్యనారాయణ, మురళీకృష్ణ పాల్గొన్నారు.

### కొలనుకుదురులో వైద్యశిబిరం

మనుబోలు మండలంలోని కొలనుకుదురు గ్రామంలో పిహెచ్‌సి వైద్యుడు సుబ్బరాజు ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటుచేసి రోగులను పరీక్షించి మందులిచ్చారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని రోగులకు సూచించారు. ఏఎన్ఎం సులోచన, సూపర్‌వైజర్ నాగయ్య, సిహెచ్‌ఓ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

### గుడ్లదొనలో 'చేతబడి' కలకలం

కలిగిరి మండలం గుడ్లదొనలో చేతబడి కలకలం రేపు తోంది. పడమర గుడ్లదొన కాలనీలో ఇటీవల ఓ ఇంటి ముందు పసుపు కుంకుమలతో ముగ్గులు, సీలలు గుచ్చివున్న ఓ లబ్బరు బొమ్మను చూసి ప్రజలు బెంబేలెత్తిపోయి, వెంటనే పోలీసులకు ఫిర్యాదుచేశారు. గ్రామానికి కొత్తవారెవరైనా వచ్చి ఈ చేతబడులు చేస్తున్నారా అని ఎస్ఐ సూర్యప్రకాష్‌రెడ్డి ఆరా తీస్తున్నారు.

## 'నెల్లూరులో సివిల్ సప్లయిస్ కుంభకోణం'..

# తీగ లాగారు.. డొంకంతా కదులుతోంది

- కోట్లు కాజేసిన అక్రమార్కులపై కొరడా
- 11 మందిపై క్రిమినల్ కేసులు
- మరికొంతమందిపై విచారణలు
- ఆస్తుల జప్తుకు రంగం సిద్ధం
- 30 కాదు.. ఇంకా ఎన్ని కోట్లు తిన్నారో?...
- లెక్క తేల్చి..తాటతీస్తామంటున్న అధికారులు

*'తీగ లాగితే డొంకంతా కదిలిందన్న' చందంగా నెల్లూరులోని పౌరసరఫరాల సంస్థ కుంభకోణంలో లాగేకొద్దీ.. లెక్కలు తీసేకొద్దీ అవినీతి పుట్టలు బయటపడుతూనే ఉన్నాయి. అడ్డూ అదుపు లేకుండా అందినకాడకి కోట్లు దోచేసుకుంటున్న అవినీతిపరులకు ప్రభుత్వసంస్థే ఒక అడ్డాగా మారిపోవడం, ఉద్యోగుల..అధికారులు..ఇంకా ఇతరులు ఎవరికి వారు దొరికినంత మింగేయడం... రాష్ట్రవ్యాప్తంగా ఈ కుంభకోణం పెద్ద సంచలనం కలిగిస్తోంది. అందులోనూ రైతులకు, హమాలీలకు చెల్లించాల్సిన కోట్లాది రూపాయలను దారిమళ్ళించి తినేయడం..ప్రజల్లోనూ కలకలం రేపుతోంది. ఇప్పటికైతే దాదాపు 30 కోట్ల దాకా బొక్కేశారని అంటున్నారే కానీ, అది ఇంకా ఎంత పెద్ద కుంభకోణంగా బయటపడుతుందో చెప్పలేమంటున్నారు. కనీసం 100 కోట్లకు పైగానే స్వాహా జరిగిపోయి ఉండవచ్చునే అవకాశం ఉందని కూడా ఉద్యోగవర్గాల్లో అనుమానాలున్నాయి. లెక్కలన్నీ పూర్తిస్థాయిలో తేలితే తప్ప, ఈ కుంభకోణం ఇంకా ఎంత భారీస్థాయిలో జరిగిందనేది తేలదు.*

నెల్లూరులోని పౌరసరఫరాల సంస్థలో ఇప్పటిదాకా అంచనా వేస్తున్న 29.78 కోట్ల కుంభకోణానికి సంబంధించిన సూత్రధారులు, పాత్రధారులందరినీ గుర్తించేందుకు, అక్రమార్కులపై కఠినచర్యలు తీసుకునేందుకు జిల్లా ఉన్నతాధికారులు రంగంలోకి దిగడంతో కోట్లల్లో ప్రజాధనం మింగేసిన అవినీతి జలగలకు వణుకు మొదలైంది. ఆ సంస్థలో ఇంకా ఎన్ని కోట్లు తినేశారో లెక్క తేల్చేందుకు, గతంలో కూడా జరిగిన ఆ సంస్థ ఆర్థిక లావాదేవీలన్నిటినీ కూలంకుషంగా పరిశీలిస్తున్నారు. చెదలు పట్టిన ఫైళ్లు దుమ్ము దులిపి, ప్రతి పద్దునూ నిశితంగా పరిశీలిస్తున్నారు. ప్రభుత్వ సంస్థలో ఇంత పెద్ద అవినీతి కుంభకోణం బయటపడడంతో, ఇతర ప్రభుత్వ శాఖల్లోనూ అకౌంట్స్ పరిస్థితి ఎలా ఉందో, లెక్కలన్నీ సరిగా ఉన్నాయో లేదో సరిచూసుకుంటున్నారు.

### 11 మందిపై క్రిమినల్ కేసులు

ఇప్పటికే ఆ సంస్థ ఉద్యోగులతో పాటు, మరికొందరు బాధ్యులను కూడా కలిపి 11 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. కొందరి ఆస్తుల జప్తుకు రంగం సిద్ధం చేశారు. ఆ సంస్థలో పనిచేసిన ఇతర అధికారుల వ్యవహారాలను కూడా ఆరా తీస్తున్నారు. ఇప్పటికే ఆ సంస్థ డిఎంను సస్పెండ్ చేశారు. ఆమెతో పాటు, ఆమె కంటే ముందు పనిచేసిన అధికారిపై కూడా అవినీతి ఆరోపణల నిగ్గుతేలితే చర్యలు తీసుకునేందుకు సమాయత్తమవుతున్నారు. ఇంకా మరికొందరు కూడా ఈ కుంభకోణానికి పాల్పడి సొమ్ము కాజేశారన్న సమాచారంతో, ఎవరెవరు ఏఏ బ్యాంకుల్లో ఎంతెంత నగదు డ్రా చేశారో, ఎంత అవినీతి జరిగిందో, అక్రమార్కులకు ఎవరెవరు సహకరించారో బ్యాంకుల అధికారులతో కలసి లెక్కలు చూస్తున్నారు.

### భారీగా ఆడిట్ తనిఖీలు

ధాన్యం కొనుగోళ్ళకు సంబంధించి రైతులకు, హమాలీలకు చెల్లించాల్సిన డబ్బు సుమారు 29.78 కోట్లు దారిమళ్ళడం వెనుక, ఆ మొత్తాన్ని స్వాహా చేయడం వెనుక ఉద్యోగులు, అధికారులు, ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్నవారితో సహా లెక్కల మతలబులేమిటో ఆడిట్ అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ కుంభకోణంలో 2007 నుంచి కాక, అంతకు ముందున్న సంవత్సరాల్లో కూడా ఏం జరిగిందో, ఎంత మొత్తం స్వాహాకు గురైందో కూడా లెక్కలు చూస్తున్నారు. మరోవైపు జిల్లా కలెక్టర్, జేసీ తదితర ఉన్నతాధికారులు, పోలీసు ఉన్నతాధికారులు కూడా రంగంలోకి దిగి, ఈ కుంభకోణం బాధ్యులను గుర్తించేందుకు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ప్రత్యేకించి ఈ కుంభకోణానికి సూత్రధారి అని భావిస్తున్న ఔట్‌సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్‌ను ఈ కుంభకోణం అసలెలా జరిగిందో తెలుసుకునేందుకు ప్రత్యేకంగా విచారిస్తున్నారు. ఆడిట్ అధికారులు పెద్దఎత్తున తనిఖీలు చేస్తూ, అక్రమార్కుల బండారాన్ని బయటపెడుతున్నారు. ఒక్క నెల్లూరులోనే కాక, జిల్లాలోనూ, రాష్ట్రవ్యాప్తంగా కూడా ఇదే తరహా కుంభకోణాలు జరిగే అవకాశం ఉంటుందని భావిస్తూ ఆ దిశగా కూడా ఆలోచించి, అన్నిశాఖల్లో ఆడిట్ చేయించాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నారు. లెక్కలన్నీ తేలితే, అక్రమార్కులందరినీ గుర్తిస్తే ఎన్ని కోట్లు స్వాహా అయిపోయాయో, ఎంత మంది ప్రజల డబ్బును పంచుకుతిన్నారో తేలుతుంది.

---

# పవర్ లేని పోలీసు

(మొదటి పేజీ తరువాయి)

ఇదే తరుణంలో, ఆంధ్ర రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైపోయిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తమ కళ్ళ ముందే నేరం జరిగినా ఆ నేరం చేసిన వాడు అధికార పార్టీ వాడైతే కనీసం ఎఫ్.ఐ.ఆర్ కూడా ఫైల్ చేయలేని నిస్సహాయ స్థితిలో పోలీసుశాఖ వుందనడానికి అనేక సంఘటనలు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. నేరం ఎలాంటిదైనా, భాదితులు ఎంతటివారైనా నేరం చేసినవాడు అధికార పార్టీ నేతకు తొత్తయితే చాలు. హత్య చేసి కుడా వాడు సునాయాసంగా తప్పించుకోవచ్చన్న ధీమా వారికి అధికార పార్టీ నేతలు కల్పిస్తున్నారన్న విషయం అనేక సంఘటనలలో స్పష్టమైపోతుందని పలువురు ఆరోపిస్తున్నారు.

ఎంతో ప్రశాంత నగరంగా పేరు పొందిన నెల్లూరు కూడా ఇప్పుడు నేరగాళ్లకు నిలయంగా మారిందని నగరవాసులు ఆందోళన చెందుతున్నారు. తమ స్వప్రయోజనాల కోసం, తామనుకున్న లక్ష్యాలు సాధించుకోవడం కోసం రౌడీషీటర్లను, పాత నేరస్తులను అధికారపార్టీ నాయకులే పెంచి పోషిస్తున్నారనే విమర్శ వినపడుతోంది. వైసీపీ నాయకుల మధ్య ఉన్న ఆధిపత్య పోరు పుణ్యమా అని ఇలాంటి చిల్లర గ్యాంగుల పంట పండిందని జిల్లా పోలీసుశాఖకు చెందిన ఒక సీనియర్ అధికారి వాపోవడం గమనార్హం. తప్పు చేసిన వ్యక్తిపై ఆధారాలతో ఫిర్యాదు చేసినా, సదరు నేరస్తుడు అధికారపార్టీ నేతకు చెందినవాడైతే వాడిపైన ఎఫ్ఐఆర్ ఫైల్‌చేసే ధైర్యం, దమ్ము తమ దొరకు సైతం లేదని ఆ అధికారి నిట్టూర్చడం, జరుగుతున్న పరిణామాలకు నిదర్శనం. ఒకవేళ పొరపాటుగా ఆ నేరస్తుడి వెనుక ఎవరున్నారో తెలియక కేసు రిజిస్టరైనా, ఆ తరువాత అసలు విషయం తెలుసుకుని నాలుక కరుచుకుంటున్న సంఘటనలు కోకొల్లలు జరుగుతున్నాయంటున్నాడా బడా అధికారి.

### అసహాయస్థితిలో పోలీసు వ్యవస్థ..!

ఈ తరహా పరిస్థితులలో "కరవమంటే కప్పకు కోపం – విడవమంటే పాముకి కోపం" అన్న తరహాలో పోలీసుశాఖ నలిగి పోతోంది. పలానా వాడు నేరం చేశాడని తెలిసినా తమ చేతులకే బేడీలు వేసుకుని చోద్యం చూస్తున్నారు ఖాకీలు. నేరస్తుడు, బాధితుడు ఇద్దరూ అధికారపార్టీకి చెందిన వారే కావడంతో ఆ నేరం ఎంత పెద్దదైనా చర్యతీసుకునే ధైర్యం చేయలేక పోతున్నారు. కాదని ఒకడుగు ముందుకేస్తే అధికార పార్టీకి చెందిన ఏదో ఒక నేత నుండి తీవ్రస్థాయి స్వరంతో ఫోన్ రావడమో, లేదంటే తమకున్న పరపతితో సంబంధిత స్టేషన్ అధికారిని క్షణాల్లో బదిలీతో బలి చేయించడమో జరిగిపోతాయని భయపడి పోతున్నారు.

### పోస్టింగులకి, బదిలీలకి కూడా రాజకీయ గ్రహణం

ఇలాంటి పరిస్థితులలో కానిస్టేబుల్ స్థాయి నుండి డీఎస్పీ స్థాయి వరకు పోస్టింగులు, బదిలీలలో కూడా మితిమీరిన రాజకీయ జోక్యంతో ఉన్నతాధికారులు తల పట్టుకుంటున్నారు. ఉదాహరణకు నెల్లూరు నగరంలో గత పది మాసాలుగా డీఎస్పీ లేరు. అదేవిధంగా కావలి పట్టణంలో కూడా డీఎస్పీ లేరు. రాష్ట్రంలో చాలాచోట్ల ఇదే పరిస్థితి కొనసాగుతున్నట్లు తాడేపల్లి సమాచారం. డీఎస్పీ స్థాయి అధికారిని నియమించాలంటే సదరు జాబితాకు ముఖ్యమంత్రి కార్యాలయం నుండి అనుమతి, ఆమోదం రావాలి. ఇప్పటికే రాష్ట్రంలో చాలాచోట్ల ఖాళీగా ఉన్న డీఎస్పీ పోస్టుల జాబితా సీఎంవోలో సిద్ధంగా ఉంది. అయితే కొన్ని ప్రాంతాలనుండి తమ పార్టీ నాయకులే రెండు లేదా మూడు పేర్లను ప్రతిపాదించి ఉండడంతో ఇప్పుడు ఈ అనవసరమైన వివాదం ఎందుకని పూర్తిగా డీఎస్పీ స్థాయి అధికారుల బదిలీలు, పోస్టింగుల జాబితా పక్కనపెట్టినట్లు సమాచారం.

### సంకట స్థితిలో వైసీపీ అభిమానులు
### బాధితుల మొరాలకించని పార్టీ పెద్దలు!

ఒకే పార్టీకి చెందిన నేతల మధ్య రాష్ట్రవ్యాప్తంగా అంతర్గత యుద్ధం జరుగుతోంది. ప్రతీ జిల్లాలోనూ ప్రతీ నియోజక వర్గంలోను(కొన్నిచోట్ల మినహా) అధికార పార్టీలో ఇద్దరు లీడర్లు తయారయ్యారు. వీరి పోకడ ఫలితంగా ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ సానుభూతిపరులు, అభిమానులు, వై.ఎస్. కుటుంబ సన్నిహితులు సైతం ఇబ్బందిపడుతున్నారు. జగన్ మోహన్‌రెడ్డి పట్ల అభిమానం, ఆయన నాయకత్వం పట్ల నమ్మకం ఉన్నప్పటికి, స్థానికంగా నేతలు చేస్తున్న అరాచక చర్యలవల్ల అలాంటి వారంతా పార్టీకి దూరమవుతున్నారు. నయా నాయకులు అవలంభిస్తున్న నియంతృత్వ విధానాలవల్ల అసంతృప్తితో నీరుగారిపోతున్నారు. వైఎస్ వారసుడిపై ఉన్న అభిమానాన్ని చంపుకోలేక, జరుగుతున్న పరిణామాలను నియంత్రించే పెద్దదిక్కు లేక, ఏం చేయాలో దిక్కుతోచని సంకట స్థితిలో రాజశేఖరరెడ్డి ఆప్తులు, ఆత్మీయులు, సుధీర్ఘకాలంగా ఆయన వెంట నడచిన వారి అనుయాయులు సతమతమవుతున్నారు.

వాస్తవ పరిస్థితులను పార్టీ సలహాదారులు, పెద్దల దృష్టికి తెస్తే అవేవో మీ వ్యక్తిగత గొడవలు, పార్టీకి ఏం సంబంధం అంటూ కొట్టి పారేస్తున్నారు. నిజానిజాలు వారికి తెలిసినా మనకెందుకు వచ్చిందిలే అన్నట్లుగా తప్పించుకుంటున్నారు. తమ పనులు తమకు జరిగిపోతే చాలు, ఇంకొకరి విషయంలో తలదూర్చి తలనొప్పులు తెచ్చుకోవడం ఎందుకన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.

"వైఎస్సార్ పార్టీ బలంగా ఉంది. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని, ఆయన పరిపాలనా సామర్థ్యాన్ని ప్రజలు సమర్థిస్తున్నారు. గతంలో కనీ వినీ ఎరుగని రీతిలో ఆయన అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను, నగదు బదిలీ ద్వారా అందిస్తున్న ఆర్థిక చేయూతను ప్రజలు స్వాగతిస్తున్నారు. ఈ రాష్ట్రానికి మళ్ళీ జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి కావాలని జనం కోరుకుంటున్నారు. కానీ, క్షేత్రస్థాయిలో జరిగే వాస్తవ పరిస్థితులను, జరుగుతున్న అరాచకాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లేవారు లేకపోవడంతో చాలామంది ఆయన సొంత మనుషులే ఆయనకు దూరమవుతున్నారు" అని ఒక వైకాపా సీనియర్ నాయకుడు కామెంట్ చేశాడు.

ఏ ప్రభుత్వ విభాగమైనా అధికారపార్టీ ఆదేశాలను పాటించి పని చేయాల్సిందే. ఇందులో పోలీసుశాఖకు మినహాయింపు లేదు. అయితే అధికార పక్షం, ప్రతిపక్షం రెండూ బలంగా ఉన్నప్పుడు అధికారపార్టీ పక్షం వైపే మొగ్గుచూపడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ. కానీ, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో విచిత్రమైన పరిస్థితులను ఏపీ పోలీసుశాఖ ఎదుర్కోవలసి వస్తుంది. ఇక్కడ ప్రతిపక్షమే లేకపోవడంతో స్వపక్షంలోని విపక్షాలతో వచ్చే సమస్యలతో ఆ శాఖ అధికారులు తలపట్టుకుంటున్నారు. ఈ క్లిష్ట పరిస్థితుల నుండి తమను ఆ జగన్నాయకుడే కాపాడాలని వేడుకుంటున్నారు.

### స్టేషన్‌కి వెళ్లిన ఆనం రామనారాయణరెడ్డి

ఇటీవల నెల్లూరు నగరంలో వేణుగోపాలస్వామి ఆలయ ఆస్తులకు సంబంధించిన చిన్న వివాదం చిలికి చిలికి గాలివానగా మారింది. వైసీపీలోని ఒక వర్గానికి చెందిన వ్యక్తులు ఆలయ స్థలాన్ని ఆక్రమించి అక్రమ కట్టడం నిర్మించారని ఆరోపిస్తూ.. ఆ కట్టడాన్ని ఆలయ ఛైర్మెన్ అధికారులు తొలగించారు. అంతే, వెంటనే ఆలయ ఛైర్మెన్‌తో పాటు దేవస్థాన కార్యాలయ మేనేజర్‌పై కూడా దర్గామిట్ట పోలీస్‌స్టేషన్‌లో అట్రాసిటీ కేసు రిజిస్టరయ్యింది. ఛైర్మెన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డితో పాటు మేనేజర్ రాజును దర్గామిట్ట ఇన్స్‌పెక్టర్ విచారణ పేరుతో అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించారు. సదరు ఛైర్మెన్ ఆనం వారి అనుయాయుడు. అంతేకాదు వైకాపా అభిమాని కూడా. వారిని విడిపించడానికి ఫోను ద్వారా విఫల ప్రయత్నం చేసిన మాజీ మంత్రి, వెంకటగిరి శాసనసభ్యుడు ఆనం రామనారాయణరెడ్డి ఏకంగా దర్గామిట్ట పోలీసు స్టేషన్‌కి రావలసి వచ్చింది. ఇలాంటి సంఘటనలతో ఒకే పార్టీ నేతల మధ్య వున్న విభేదాలు బహిర్గతమవుతున్నాయి. ఇలా ఒక్క నెల్లూరు నగరంలోనే కాకుండా, నెల్లూరుజిల్లాతో పాటు రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో కూడా జరుగుతున్నాయని పార్టీవర్గాలు ఆందోళన చెందుతున్నాయి.

# అయ్యో పాపం! విశాఖ!!

విశాఖపట్నం. చెన్నై నుంచి కలకత్తా మధ్య భారత తూర్పు కోస్తాలో ఓ మణిహారం విశాఖపట్నం. దేశంలోనే నాలుగవ పెద్ద సహజ ఓడరేవు. ఒక పక్కన సముద్రం... మరొక పక్క భారత తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రం, మరోపక్క కొండలు, అందమైన బీచ్‌లతో ప్రశాంతమైన... ఆహ్లాదకరమైన నగరంగా విలసిల్లుతున్న అందాల నగరం.... విశాఖపట్నం.

నిజానికి, కొత్తగా అభివృద్ధి చేయడానికి అక్కడ ఏమీలేదు. దగ్గర దగ్గర ఇరవై లక్షలమంది జనాభా ఇప్పటికే అక్కడ నివసిస్తున్నారు. ఇప్పుడు మనం 21వ శతాబ్దంలో ఉన్నాం. కానీ, 9వ శతాబ్దంలోనే, వైజాగ్ మీదుగా కాశీకి వెడుతున్న ఒక సంస్థానాదీశుడు వైజాగ్ అందచందాలకు ముగ్ధుడై, తన కుల దైవం అయిన కుమారస్వామికి(విశాఖేశ్వరుడు అని ఆయనకు ఒక పర్యాయ పదం ఉంది. అందుకే, అది విశాఖ అయింది) చక్కని గుడి కట్టించినట్టు చరిత్రలో ఉంది.

అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఆంధ్ర విశ్వవిద్యాలయం, దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విద్యాలయం, గీతం విశ్వ విద్యాలయం, ఇండియన్ మారిటైం విశ్వ విద్యాలయం, ఆంధ్ర మెడికల్ కాలేజీ, గీతం మెడికల్ కాలేజీ, గాయత్రీ మెడికల్ కాలేజీ, ఎన్నారై మెడికల్ కాలేజీ, ఇండియన్ ఇన్స్టిట్యూట్ అఫ్ మేనేజ్ మెంట్, ఇండియన్ ఇన్స్టిట్యూట్ అఫ్ పెట్రోలియం ఎనర్జీ, కలాం ఇన్స్టిట్యూట్ అఫ్ హెల్త్ టెక్నాలజీ, నేషనల్ ఇన్స్టిట్యూట్ అఫ్ ఓషనోగ్రఫీ, నేవల్ సైంటిఫిక్ టెక్నలాజికల్ లేబరేటరీ, ఫిషరీ సర్వే అఫ్ ఇండియా, జియలాజికల్ సర్వే అఫ్ ఇండియా వంటి వివిధ రకాల విద్యా, వైద్య, సాంకేతిక, రక్షణ, శాస్త్రీయ సంస్థలతో ఇప్పటికే అలరారుతున్న విశాఖపట్నాన్ని ఎవరైనా కొత్తగా అభివృద్ధి చేసేది ఏముంది?

అందుకే, అభివృద్ధి కోసమే విశాఖపట్నంలో ఎగ్జిక్యూటివ్ రాజధాని అనే మాట వినబడినప్పుడల్లా.... 'కాదు, కాదు.... అక్కడ ఉన్న విలువైన భూములను కబ్జా చేయడానికే. ఇదొక ముసుగు మాత్రమే' అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ రగడ చూస్తుంటే, ఆంధ్రప్రదేశ్‌లో భౌగోళికంగా ఉండడమే.. విశాఖ చేసుకున్న పాపం అనిపిస్తున్నది.

ఈ రగడ, రచ్చ నేపథ్యంలో ఈ నెల 15 న వైసీపీ ఆధ్వర్యంలో 'ఘర్జన' పేరిట ఒక ర్యాలీ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి వైసీపీయే నాయకత్వం వహిస్తున్నది. ఆ పార్టీకి శాసనసభలో 175కి 151 స్థానాలు ఉన్నాయి. విశాఖపట్నంను ఎగ్జిగ్యూటివ్ రాజధానిగా చేస్తూ నిర్ణయం తీసుకోవాల్సింది... లేదా చట్టం చేయాల్సింది... వైసీపీ సారథ్యంలోని ప్రభుత్వమే. మరి ర్యాలీలు, ఘర్జనలు, బల ప్రదర్శనలు ఎందుకన్నది అర్థం కావడం లేదు.

అయినప్పటికీ, "బ్రహ్మాండం! సూపర్... భూమి బద్దలైందా... ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్టుగా విశాఖలో ఘర్జన ర్యాలీ జరిగింది..." అంటూ వైసీపీ నేతలు మహదానంద పడిపోయారు..

"ఫ్లాప్. అట్టర్ ఫ్లాప్. వచ్చినోళ్లల్లో పెయిడ్ ఆర్టిస్టులే ఎక్కువ.." అంటున్నారు, వైసీపీ ప్రత్యర్థులు. వైసీపీ ప్రత్యర్థులు ఒక్కరు కాదు, ఇద్దరు కాదు. టీడీపీ, జనసేన, కమ్యూనిస్టులు, బీజేపీయులు, కొన్ని ప్రజా సంఘాలు.... అందరూ ఇదే మాట.

విశాఖలో ఎగ్జిక్యూటివ్ రాజధాని కావాలని జనం కోరుతున్నట్టుగా కనిపించడానికి ఈ ర్యాలీని వైసీపీ నేతలు నిర్వహించినట్టు కనపడుతున్నది.

వైసీపీ నేతలు, ప్రభుత్వాధి నేతలు, అధికారులు ఏకోన్ముఖంగా పనిచేసి విశాఖ వీధులలో జనాన్ని ఓ మేరకు... కదం తొక్కించారు. వానదేవుడు కూడా... పిలవని పేరంటంలా వచ్చి, వారి ఉత్సాహం మీద నీళ్లు జల్లాడు.

అయితే... ప్రభుత్వ సలహాదారు, వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ఓ విలువైన ముక్క చెప్పారు.

అసలు సామాన్య జనానికి రాజధానితో పనేంటి అని ఆయన ప్రశ్నించారు. అదీ అసలైన ప్రశ్న! అమరావతి రైతుల ఉద్యమాన్ని దృష్టిలో పెట్టుకుని ఆయన ఆ ముక్క చెప్పి ఉంటారు.

అమరావతిలో ఉన్నా విశాఖలో ఉన్నా... మామూలు జనానికి దానితో పని ఉండదు అనేది..., సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పినట్టు... వాస్తవం.

అయినప్పటికీ, ఉన్న రాజధానిని మరోచోటకు ఎందుకు మార్చుదామని అనుకుంటారో మంత్రి బొత్స సత్యనారాయణ గతంలో చెప్పిన మాటలు ఇప్పుడు మీడియాలో వైరల్ అవుతున్నాయి. భూములను కబ్జా చేయాలనుకుంటేనే రాజధాని మార్పు చేస్తారని ఆయన అన్న వీడియోలను కొన్ని ప్రచార మాధ్యమాలు పదే పదే జనం దృష్టికి తీసుకువస్తున్నాయి.

మంత్రులకు, ఎం.ఎల్.ఏలకు, అధికారులకు, కాంట్రాక్టర్లకు, పవర్ బ్రోకర్లకు, నాయకుల వెనకాల తిరిగే వైట్ & వైట్ ఆవారాలకు, పైరవీ కారులకు తప్ప సామాన్య జనంలో 99% మందికి క్యాపిటల్‌తో పనిలేదు. అది ఎక్కడపెట్టినా వారు వెడతారు.

అయినప్పటికీ ఇంత డబ్బు ధారపోసి, ఇంత మంది ఆఫీసర్ల పీకల మీద కూర్చుని, ఇంతమంది పోలీసుల్ని మోహరించి, ఇంతమంది డ్వాక్రా మహిళలను బెదరేసి, ఇంతమంది స్టూడెంట్స్‌ను పట్టుకొచ్చి, ఇంతమంది మామూలు జనాన్ని పోగేసి, ఘర్జన అంటూ విశాఖలో ర్యాలీ చేయించాల్సిన పని ఏమిటన్నది అర్థం కాదు.

దేశంలో ఇంకా ఏ రాష్ట్రంలోనూ పూర్తి క్యాపిటల్ కాకుండా ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ లేదు. తెలుగువారికి ఇదో కొత్త అనుభవం. ఒక కొత్త కాన్సెప్ట్.

రాజధాని అంటే సచివాలయం, సీ.ఎం క్యాంపు కార్యాలయం, గవర్నర్ 'రాజ్‌భవన్'తో పాటు డీజీపీ కార్యాలయం. వీటితో పని ఉన్న మంత్రులు, ఎంఎల్‌ఏలు, ఎంపీలు, అధికారులు, ఉద్యోగులు,






కాంట్రాక్టర్లు, పైరవీకారులు, పొలిటికల్ బ్రోకర్లు, అడ్మినిస్ట్రేటివ్ బ్రోకర్లుకు తప్పితే, మామూలు జనానికి క్యాపిటల్‌తో పని బడదు. అది ఎక్కడుంటే... వీరంతా అక్కడికి వెడతారు. విశాఖపట్నంలో అనే కాదు చిత్తూరులో పెడితే, అక్కడకూ వెడతారు. విశాఖలో పెడితే, విశాఖకు వీళ్ళ తాకిడి పెరుగుతుంది గానీ, ఉత్తరాంధ్ర డెవలప్ కాదు.గత 66 ఏళ్ళలోనూ ఉత్తరాంధ్ర డెవలప్ కాలేదని ఇందుకు... ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ అక్కడ లేకపోవడమే కారణమని ఎవరైనా భావిస్తున్నారేమో తెలియదు. పార్టీ ఏదైనా... ఉత్తరాంధ్రలో నాయకులుగా పాతుకుపోయిన వారు ఇన్నాళ్ళూ ఎందుకు డెవలప్ చెయ్యలేదు అనే ప్రశ్న ఉండనే ఉంది.

ఈ సందర్భంగా కొన్ని ప్రశ్నలు మదిలో మెద లక మానవు.

* ఇన్నాళ్ళు డెవలప్ కాని ఉత్తరాంధ్ర ఇప్పుడు ఎలా డెవలప్ అవుతుంది?
* అసలు అది ఎందులో డెవలప్ కాలేదు?
* విశాఖ డెవలప్ కాలేదా.... లేక, శ్రీకాకుళం, విజయనగరం కూడా డెవలప్ కాలేదా?
* లేకపోతే, శ్రీకాకుళం... విజయనగరం జిల్లాల్లో నేతలు బాగా డెవలప్ కాలేదా?
* ఆ రెండు జిల్లాలూ డెవలప్ కాకపోతే విశాఖకు బదులు శ్రీకాకుళంలోనో... విజయనగరంలోనో ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ పెడితే, అవి కూడా విశాఖ అంత డెవలప్ అవుతాయి కదా?
* ఈ విషయం జగనన్నకు ఆ జిల్లాల నేతలు చెప్పలేదా? 2019లోనే జగనన్న అధికారంలోకి వచ్చారు కదా!
* ఓ నాలుగైదు నెలల్లోనే విశాఖలో ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ పెట్టేస్తే.... ఈ పాటికే ఉత్తరాంధ్ర డెవలప్ అయిపోయేది కాదా?
* అసలు ఎగ్జిక్యూటివ్ అనేమిటి? మొత్తం క్యాపిటల్ విశాఖకు తరలిస్తే, అడిగే వాడెవ్వడు?
* ఇక, విశాఖలో ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ కొత్తగా కడతారా?



* లేక ఇప్పుడున్న విశాఖనే ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌గా ప్రకటిస్తారా?
* కొత్తగా కట్టడానికి ఖాళీ భూములు ఉన్నాయా?
* ప్రభుత్వ భూములా? రైతు వారీ భూములా?
* ఎన్ని ఎకరాలు అవసర మవుతాయి?
* అందులో ప్రభుత్వ భూములు ఎన్ని ఎకరాలు? ప్రైవేటు భూములు ఎన్ని ఎకరాలు?
* క్యాపిటల్ నిర్మాణాల కోసం ఎన్ని ఎకరాలు సేకరించారు?
* కొత్తగా ఎగ్జిగ్యూటివ్ క్యాపిటల్ నిర్మాణానికి ఎంత మొత్తం కేటాయించారు? బడ్జెట్ కేటాయింపు ఉందా? అసలు కేటాయింపు ఉందా... లేదా?
* ఎప్పుడు మొదలుపెట్టి ఎప్పటికి పూర్తి చేయాలానేది ఉత్తరాంధ్ర నాయకుల అంచనా?
* విశాఖను ఆనుకుని సముద్రం ఉంది. దానికి అప్పుడప్పుడూ తుఫానులూ, గట్రా వస్తుంటాయి. తుఫాను వచ్చినప్పుడల్లా విశాఖ వణుకుతుంటుంది. హుద్‌హుద్ తుఫాను విశాఖను ఓ రౌండ్ ఉతికి ఇస్త్రీ చేసింది, గుర్తుంది కదా! మరి, అలాటి తుపానుల నుంచి రక్షణకు ఏం చేయాలని ఏమైనా ఆలోచించారా?
* పాకిస్తాన్‌తోనో, చైనాతోనో ఎప్పుడో ఒకప్పుడు యుద్ధం వస్తే... వాళ్ళ నౌకా దళాలకు ముందుగా గుర్తొచ్చేది విశాఖపట్నమే కదా!
* 1971డిసెంబర్ 4 అర్ధరాత్రి పాకిస్తాన్ సబ్‌మెరిన్ ఘాజీని విశాఖ పక్కనే ఉన్న బంగాళాఖాతంలో మన నౌకాదళం ధ్వంసం చేసింది. 11 మంది ఆఫీసర్లు, 82 మంది నావికులతో సహా ఘాజీ మునిగిపోయింది. డిసెంబర్ 5 ఉదయం తెల్లారుతూనే ఈ విషయం తెలిసి, విశాఖకు వళ్ళు జలదరించింది. కాళ్ళు వణికాయి, ఘాజీని మన నౌకాదళం ముందుగానే కనిపెట్టి ఉండకపోతే!?
* మరి అటువంటి పరిస్థితి మళ్ళీ తలఎత్తితే ఏమిచేయాలనేది ఆలోచించారా?
* ఘర్జనలో పాల్గొన్నది, ఘర్జించింది ఉత్తరాంధ్ర వైసీపీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు మాత్రమేనా?... మిగిలిన కోస్తా ఆంధ్ర, రాయలసీమ వాసులు కూడా విశాఖ వచ్చి ఘర్జించారా?
* ఘర్జించి ఉంటే గనుక తమ ప్రాంతం అభివృద్ధి చెందక పోయినా ఫర్లేదు... ఉత్తరాంధ్ర డెవలప్ కావాలి ముందు అనేది వాళ్ళ భావనా?
* రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి విశాఖ రావడానికి ట్రాన్స్‌పోర్ట్‌కు, మందు.... మాకుకు, తిండీ తిప్పలకు, ఘర్జించినందుకు, తిరిగి వెళ్లినందుకు ఒక్కొక్కరికి ఎంత ఖర్చు అయి ఉంటుంది? ఎవరు పెట్టారు?
* ఇంతకూ... విశాఖను ఎప్పుడు ఎగ్జిక్యూటివ్ రాజధానిగా ప్రకటిస్తున్నారు? ఇప్పటికే ప్రకటించేశారా?
* ఇంతమంది విశాఖ వీధులలో ఘర్జించిన తరువాత ఇక ఆలస్యం దేనికి?
* ఇప్పటిదాకా ప్రకటించక పోతే ఎప్పటిలోగా ప్రకటిస్తారు? ఓ పక్కన అసెంబ్లీ ఎన్నికలు కనుచూపు మేరలోకి వచ్చేస్తుంటే... ఇదివరకెప్పుడో చేయాల్సిన పని ఇంకా ఆలస్యమైతే... ఉత్తరాంధ్ర ప్రాంతానికి అన్యాయం జరిగిపోదా? ఇంకా వెనుకబడి పోదా? అప్పుడు ఘర్జనకు విలువేముంటుంది?
* ఉత్తరాంధ్ర నేతలు ఆ ప్రాంత ప్రజలకేం సమాధానం చెబుతారు?....
* ఏదో ముతక సామెత చెప్పినట్టు వారికి ఇంత ఆశపెట్టి, రేపు విశాఖకు ఎగ్జిగ్యూటివ్ క్యాపిటల్ తేలేకపోతే, ఒకటి ఆశపెట్టి... ఒకటి చేసినట్టు అవ్వదా? ఉత్తరాంధ్ర జనాన్ని కూడా మోసం చేసినట్టు అవ్వదా?

నిజానికి ఉత్తరాంధ్ర నేతలకు విశాఖ ఇంతకాలమూ కనిపించని ప్రేమ ఇప్పుడు కనిపించడానికి ప్రధాన కారణం.... సీఎం జగన్ తీసుకున్న వైఖరి. అమరావతి ప్రాంతాన్ని రాష్ట్ర రాజధానిగా కొనసాగించడం ఆయనకు ఇష్టం లేదనేది బహిరంగ రహస్యమే కదా! అందుకే "మూడు రాజధానులు" అనే మాట తెరపైకి వచ్చింది. ఆ ఆలోచనకు వైసీపీయేతర వర్గాల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది.

అమరావతి నుంచి రాజధానిని ఎక్కడికీ మార్చవద్దని హైకోర్టు తీర్పు అమలులో ఉంది. అందువల్ల, మరో చోటకు రాజధాని తరలింపు కుదరదు. అయినప్పటికీ తమకు జరిగిన అన్యాయాన్ని చెప్పుకోడానికి రాజధాని ప్రాంత రైతులు పాదయాత్ర చేస్తున్నారు. అడుగడుగునా వైసీపీ శ్రేణులు దీనిని నిలువరించే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఆ ప్రయత్నాల్లో భాగంగానే... విశాఖలో జరిగిన 'ఘర్జన'ను చూడాల్సి ఉంటుంది.

హైకోర్టు తీర్పు అమలులో ఉండగా... ఎంత ఘర్జించినా ఏమి సుఖం!? హైకోర్టు తీర్పును అది ఉపసంహరించుకునేట్టు ... లేదా సుప్రీంకోర్టులో స్టే లభించేటట్టుగా రాష్ట్ర ప్రభుత్వం న్యాయపరమైన చర్యలు తీసుకోకపోతే ఈ తరహా ఘర్జనల వల్ల, విశాఖ ప్రాంతానికి మానసిక, భౌతిక నష్టం జరుగుతుంది. 'అయ్యో.. పాపం! విశాఖ...' అనిపిస్తుంది.

**- భోగాది వేంకట రాయుడు**

## 'రెక్కల' సుగంబాబు.. ఇక లేరు



తెలుగు సాహిత్యంలో 'రెక్కలు' కవిత్వాన్ని సృష్టించి పేరెన్నిక గన్న ప్రముఖ కవి, పైగంబర కవుల్లో ఒకరైన సుగంబాబు(74) ఈ నెల 18న కన్నుమూశారు. గుంటూరుకు చెందిన సుగంబాబు మంచి రచయిత, దర్శకుడు, జర్నలిస్టు కూడా. జర్నలిజంలోకి రాక ముందు మద్రాసులో ప్రముఖ కవి ఆత్రేయ వద్ద, నిర్మాత ఎం.ఎస్.రెడ్డి వద్ద పని చేశారు. కొన్ని సినిమాలకు మాటలు వ్రాశారు. దర్శకత్వ శాఖలోనూ పని చేశారు. 'రెక్కలు' అనే ఒక వినూత్న సాహితీ ప్రక్రియకు ఆయన ఆద్యులు. ఆయన ఆకస్మిక మృతి బాధాకరమని నెల్లూరుజిల్లా రచయితల సంఘం(నెరసం) అధ్యక్ష కార్యదర్శులు ఏ.జయప్రకాష్, పాతూరి అన్నపూర్ణలు ఒక ప్రకటనలో తమ సంతాపం ప్రకటించారు. సాహిత్యంలో పలు అవార్డులందుకున్నా భేషజం లేకుండా అందరితో కలుపుగోలుగా ఉండేవారని, ఆయన మరణం సాహిత్య రంగానికి తీరనిలోటని, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామని వారు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.





## ఆత్మీయ కలయిక

నెల్లూరు జిల్లా పూర్వ ఎస్. పి, ప్రస్తుతం అవినీతి నిరోధక శాఖ మరియు సాంకేతిక పరిజ్ఞాన విభాగాల డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ జనరల్ (డిఐజి)గా ఉన్న పి.హెచ్.డి.రామకృష్ణని తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి 'లాయర్' 40వ వార్షికోత్సవ ప్రత్యేక కాఫీ టేబుల్ బుక్ "విజయపథంలో నెల్లూరీయులు" పుస్తకాన్ని అందజేస్తున్న శివప్రభాత్‌రెడ్డి (ప్రభు)

తెలంగాణలో ఇన్స్‌పెక్టర్ జనరల్‌గా పదవీ విరమణ పొంది, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌ప్రభుత్వంలో ఏపీట్రాన్స్‌కో విభాగంలో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ (విజిలెన్స్)గా ఉన్న బుసిరెడ్డి మల్లారెడ్డిని విజయవాడలో గౌరవ పూర్వకంగా కలిసి 'లాయర్' 40వ వార్షికోత్సవ ప్రత్యేక కాఫీ టేబుల్ బుక్ "విజయపథంలో నెల్లూరీయులు" పుస్తకాన్ని అందజేస్తున్న శివప్రభాత్‌రెడ్డి (ప్రభు)

# సామాజిక సేవలో..సుష్మ!

## మన వెంకయ్య మనుమరాలికి.. 'హరిజన బంధు' అవార్డు





'తాతయ్య బాటలో మనుమరాలు' అన్నట్లుగా, ఆదర్శాలకు–సామాజిక సేవకు ప్రతీకగా నిలచిన భారత మాజీ ఉప రాష్ట్రపతి, మన వెంకయ్యనాయుడు మనుమరాలు, దీపమ్మ కుమార్తె సుష్మ కూడా వారి బాటలోనే నడుస్తోంది. మానవీయ ధృక్పధంతో సమాజానికి తనవంతు సేవలందిస్తూ ఎంతో విశిష్టమైన 'హరిజనబంధు' అవార్డును కూడా అందుకొంది. చెన్నైలో తమిళనాడు గవర్నర్ టిఎన్ రవి చేతులమీదుగా ఆమె ఇటీవల ఈ అవార్డును అందుకోవడం ఎంతో విశేషం.

సుష్మ, తన 20వ పుట్టినరోజు సందర్భంగా తమిళనాడులో బాలికల హాస్టల్‌కు ఒక బ్లాక్‌ను ఏర్పాటుచేసేందుకు సహకారం అందించడం, నిరాశ్రయులైన ఆడపిల్లల కోసం హాస్టల్ నిర్మాణం కోసం సాయమందించడం వంటి సేవాకార్యక్రమాలతో ఆమె అందరి ప్రశంసలందుకుంది. తమిళనాడులోని ఎంతోమంది పేద ఆడపిల్లలకు ఈ హాస్టల్ ఎంతగానో ఉపయోగపడుతోంది. ఈ నేపథ్యంలో హరిజన్ సేవక్ సంఘ్, చెన్నైలోని థక్కర్‌బాబా మెమోరియల్ ట్రస్ట్ చొరవతో, తల్లితండ్రుల సహకారంతో ఆమె ఈ సామాజిక సేవలందించడం అందరి మన్ననలకు పాత్రమైంది. సుష్మతో పాటు ఆమె అన్న విష్ణు కూడా తాము పొదుపు చేసిన మొత్తం నుండి కొంత సమాజ సేవకు వెచ్చించడం స్ఫూర్తిదాయకం. వెంకయ్య కుటుంబం సారధ్యంలో నడుస్తున్న 'స్వర్ణభారత్ ట్రస్ట్'లో సుష్మ కూడా ట్రస్టీగా ఉన్నారు. తండ్రి అడుగుజాడల్లో కుమార్తె దీపమ్మ, తాత, అమ్మల స్ఫూర్తితో దీపమ్మ ఇద్దరు పిల్లలు విష్ణు, సుష్మలతో పాటు వారి కుటుంబమంతా సేవామార్గంలో నడుస్తుండడం, సామాజిక సేవలో తరిస్తుండడం అభినందనీయం. శ్రీమతి సుష్మకి 'లాయర్' శుభాశీస్సులు.

# ఎమ్మెల్సీలుగా ఇద్దరినీ గెలిపించుకుందాం!

## పార్టీ శ్రేణులకు విపిఆర్ పిలుపు




రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైకాపా తరపున పోటీలోఉన్న ఇద్దరు అభ్యర్థులు ఉన్నత విద్యావంతులేనని, వారిరువురికీ భారీ మెజార్టీతో విజయం సాధించిపెట్టాలని రాజ్యసభ సభ్యులు, జిల్లా వైకాపా అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి(విపిఆర్) నాయకులు, కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. ఈ నెల 20వ తేదీ విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జిల్లాలోని కార్యకర్తలు, నాయకులతో పెద్దఎత్తున జరిగిన సమావేశంలో విపిఆర్ మాట్లాడారు. తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం నుండి ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి పార్టీలో తొలినుంచి నిబద్ధత కలిగిన కార్యకర్తగా పని చేస్తున్నారని, అదే విధంగా, ఉపాధ్యాయ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీలో ఉన్న పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి విద్యాసంస్థల కరస్పాండెంట్ గానే కాక రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మెన్‌గా కూడా విశిష్టమైన సేవలు అందిస్తున్నారని, ముఖ్యమంత్రి వై.యస్. జగన్‌మోహన్‌రెడ్డి వీరి సేవలను గుర్తించి పార్టీ తరపున వారిని అభ్యర్థులుగా నిలిపారని, అందరూ ప్రణాళికా బద్ధంగా పనిచేసి, వారిరువురినీ గెలిపించాలని ఆయన కోరారు. సమావేశంలో నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఆనం రామనారాయణరెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, ఎమ్మెల్సీలు బల్లి కళ్యాణ్‌చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# రాకెట్ ప్రయోగం.. 22న



శ్రీహరికోటలోని అంతరిక్ష కేంద్రం నుంచి ప్రతిష్టాత్మకమైన జిఎస్ఎల్‌వి మార్క్–3 భారీ రాకెట్‌ను ముందుగా అనుకున్నట్లుగా ఈ నెల 21న కాక, మరుసటి రోజుకు మార్చుకున్నట్లు సమాచారం. ఈనెల 22వ తేది అర్ధరాత్రి సరిగ్గా గం.12.07 నిమిషాలకు రాకెట్‌ను ప్రయోగించాలని ముహూర్తం నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. రాకెట్ ప్రయోగానికి 24 గంటల ముందు కౌంట్ డౌన్ ప్రారంభమవుతుంది. ప్రయోగానికి శాస్త్రవేత్తలు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. దాదాపు 5.21 టన్నుల బరువున్న ఉపగ్రహాలను సైతం అలవోకగా అంతరిక్షంలోకి తీసుకువెళ్ళే 'బాహుబలి రాకెట్'గా పేరెన్నికగన్న రాకెట్ ఇది. ఇస్రో ఛైర్మెన్ సోమనాథ్ ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు ఈ ప్రయోగం జరుపనున్నారు. ఈసారి ఏకంగా 36 ఉపగ్రహాలను ఈ రాకెట్ ద్వారా ప్రయోగిస్తుండడం విశేషం.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY**, Managing Editor : **T.BHARATHI REDDY**, Sub-Editor : **MADDURU SRINIVASULU**. e-mail: lawyerpatrika@gmail.com